



# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 37 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | శనివారం 29 మార్చి 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 37 29-03-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-


## మండిపోతున్న ఏపీ..

### నేడు తీవ్ర వడగాలులు - ఒక్కరోజే 42 డిగ్రీల సెల్సియస్



అమరావతి మార్చి 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

రాష్ట్రవ్యాప్తంగా గత పది రోజులుగా తగ్గుముఖం పట్టిన ఎండలు మళ్లీ ప్రతాపాన్ని చూపిస్తున్నాయి. రెండు రోజులుగా కాస్తున్న ఎండలతో జనాలు బెంబేలెత్తిపోతున్నారు. పగటిపూట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటుతున్నాయి. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అయితే రోడ్లపై జనాలు కూడా కనిపించడం లేదు. ఇళ్లలోనే సేద తీరుతూ ఉక్కపోతకు అల్లాడుతున్నారు. రెండు రోజులూ హైదరాబాద్, ఉమ్మడి నల్గొండ? జిల్లాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ పరిస్థితి రాష్ట్రవ్యాప్తంగా ఉంటున్నప్పటికీ, ముఖ్యంగా రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రత 42.0 డిగ్రీల సెల్సియస్ ఉమ్మడి నల్గొండ జిల్లాలోని గుర్రంపోడులో నమోదైంది.

**ఒక్కరోజే 42 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత**

మూడు రోజుల్లో ఈ ఉష్ణోగ్రతలు గరిష్ఠ స్థాయికి పెరిగే అవకాశంగురువారం హైదరాబాద్ నగరంలో నాచారం, ఎల్బీనగర్, జూబ్లీహిల్స్, కాప్రా, యూసుఫ్‌గూడ, బేగంపేట ప్రాంతాల్లో 39 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. అలాగే రాజేంద్రనగం?, గాజులరామారంలో 40 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. రాబోయే మూడు రోజుల్లో ఈ ఉష్ణోగ్రతలు గరిష్ఠ స్థాయికి పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు. ఏపీలో పలుచోట్ల 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

**ఉమ్మడి నల్గొండ జిల్లాల్లో 36 ప్రాంతాలకు ఆరెంజ్? అలర్ట్?**

అలాగే ఉమ్మడి నల్గొండ జిల్లాల్లో రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అత్యధిక ఉష్ణోగ్రతలు

- తరువాయి 2లో..

## మయన్మార్, బ్యాంకాక్‌లలో భారీ భూకంపం..

- పేక మేడల్లా కూలిన భవనాలు.. వైరల్ వీడియో
- భయాందోళనతో ఇళ్లు, కార్యాలయాల నుంచి బయటికి పరుగులు తీసిన ప్రజలు
- ఒళ్లు గగుర్పొడిచే వీడియోలు నెట్టింట వైరల్






శుక్రవారం మధ్యాహ్నం 12.50 గంటలకు (స్థానిక కాలమానం ప్రకారం) మయన్మార్‌లో 7.7 తీవ్రతతో భూకంపం సంభవించింది. ఒక్కసారిగా భారీ ప్రకంపనలు రావడంతో భారీ భవనాలు పేక మేడల్లా కుప్పకూలాయి. ప్రజలు తీవ్ర భయాందోళనతో ఇళ్లు, కార్యాలయాల నుంచి బయటికి పరుగులు తీశారు. ఇందుకు సంబంధించిన ఒళ్లు గగుర్పొడిచే వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇక భూకంప కేంద్రం సాగింగ్ నగరానికి వాయువ్యంగా 16 కిలోమీటర్ల దూరంలో 10 కిలోమీటర్ల లోతులో ఉందని యూఎస్ జియోలాజికల్ సర్వే తెలిపింది. ఇప్పటివరకు ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదని

- తరువాయి 2లో..

## బ్రిటన్ రాజు కింగ్ చార్లెస్‌కు అస్వస్థత

బ్రిటన్ : బ్రిటన్ రాజు కింగ్ చార్లెస్ స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. ఇటీవల ఆయన క్యాన్సర్ బారినపడిన సంగతి విదితమే. క్యాన్సర్‌కు చికిత్స తీసుకుంటుండగా చార్లెస్‌కు కొన్ని సైడ్ ఎఫెక్ట్‌లు తలెత్తినట్లు ప్యాలెస్ వెల్లడించింది. దీంతో ఆయన్ను ఆస్పత్రిలో చేర్పించినట్లు తెలిపింది. వైద్యుల సూచన మేరకు %ూ% గురు, శుక్రవారాల్లో జరగాల్సిన ఆయన కార్యక్రమాలను రద్దు చేసినట్లు ప్యాలెస్ పేర్కొంది.



## దేశానికి మరో 40 ఏళ్ల వరకూ ఆ సమస్య లేదు : సింఎం చంద్రబాబు

### ఆ ఆలోచన విరమించండి.. జనాభా పెంపుపై దృష్టి పెట్టండి.. ఏపీ సీఎం కీలక వ్యాఖ్యలు..

అమరావతి మార్చి 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

చెన్నై : " దేశానికి మరో 40 ఏళ్ల వరకూ ఆ సమస్య లేదు " అని సిఎం చంద్రబాబు అన్నారు. శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు చెన్నైలో పర్యటిస్తున్నారు. మద్రాసు ఐఐటీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 'ఆల్ ఇండియా రీసెర్చ్ స్కాలర్స్ సమ్మిట్-2025'లో పాల్గన్న ముఖ్యమంత్రి %ూ% ఐఐటీ విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమం పూర్తయిన తరువాత తర్వాత సాయంత్రం తిరిగి అమరావతికి చేరుకోనున్నారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు మాట్లాడుతూ %ూ%. మద్రాస్ ఐఐటీ ఎన్నో విషయాల్లో నంబర్ వన్‌గా ఉందన్నారు. ఆన్‌లైన్ కోర్సులు కూడా అందిస్తోందని తెలిపారు. ఐఐటీ మద్రాస్ స్టార్టప్ అగ్నికుల్ మంచి విజయాలు అందుకుందని ప్రశంసించారు. ఇక్కడి స్టార్టప్‌లు 80 శాతం విజయవంతమవుతున్నాయన్నారు. ఈ ఐఐటీలో సుమారు 35-40 శాతం తెలుగు విద్యార్థులే ఉన్నారని హర్షాన్ని వ్యక్తం చేశారు. ఐఐటీల స్థాపన దేశ విద్యారంగంలో గొప్ప ముందడుగు అని

- తరువాయి 2లో..




## పాస్టర్ ప్రవీణ్ మృతి కేసులో దర్యాప్తు వేగవంతం..

### రాజమండ్రి శివారులో పాస్టర్ ప్రవీణ్ అనుమానాస్పద మృతి

### దర్యాప్తు వేగవంతం చేసిన పోలీసులు

### రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారిన పాస్టర్ మృతి కేసు

అమరావతి మార్చి 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



హైదరాబాద్ నుంచి వెళ్లిన ఓ పాస్టర్ రాజమండ్రి శివార్లలో మృతిచెందిన ఘటన కలకలం సృష్టించింది.. రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారిన పాస్టర్ ప్రవీణ్ అనుమానస్పద మృతిపై సమగ్ర దర్యాప్తు వేగవంతంగా కొనసాగుతుంది. రాజమండ్రి శివారు కొంతమూరు వద్ద బుల్లెట్ పై వెళ్తూ ప్రాణాలు కోల్పోయిన పాస్టర్ ప్రవీణ్ కేసులో పోలీసులు విభిన్న కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ప్రవీణ్ మృతి పట్ల పలువురు అనుమానాలు వ్యక్తం చేసిన నేపథ్యంలో.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ప్రవీణ్ మరణం ప్రమాదమా? హత్యా? అనే కోణంలో దర్యాప్తు చేపట్టి.. ఆధారాల సేకరణలో నాలుగు పోలీసు బృందాలు నిమగ్నమయ్యాయి. మరో రెండు రోజుల్లో పోస్టుమార్టం నివేదిక వస్తే పాస్టర్ మృతిపై స్పష్టత రానుంది. అన్ని కోణాల్లోనూ ఈ కేసు సమగ్ర దర్యాప్తు జరుగుతుందంటున్నారు పోలీసులు.. పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతి కేసు.. ప్రమాదమా? పన్నాగమా? అనే మిస్టరీ మరింత ఆందోళనకు గురి చేస్తోంది. ప్రమాదానికి 12 సెకండ్ల ముందు ఏం జరిగింది?, ఆ సమయంలో సీసీ కెమెరాల్లో రికార్డయిన విజువల్స్ ఆధారంగా జరిగిన పరిణామాలపై పోలీసుల

- తరువాయి 2లో..

## ఆంధ్రాలో మార్కెట్ కమిటీలకు చైర్మన్ల నియామకం

### ఏపీలో మార్కెట్ కమిటీలు కొత్త చైర్మన్ల నియామకంపై ఆసక్తికర పరిణామాలు

అమరావతి మార్చి 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)




ఏపీలో 47 మార్కెట్ కమిటీలకు (ఏఎంసీ) కొత్త చైర్మన్ల నియామకంతో రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. కూటమి ప్రభుత్వం మొత్తం 705 నామినేటెడ్ పోస్టులను భర్తీ చేసినట్టు అధికారికంగా ప్రకటించింది. తాజాగా ప్రకటించిన 47 ఏఎంసీ చైర్మన్ పదవుల్లో 37 టీడీపీ, 8 జనసేన, 2 బీజేపీ నేతలకు దక్కాయి. మిగతా మార్కెట్ కమిటీల చైర్మన్ల నియామకం త్వరలోనే జరుగనుంది. రాష్ట్ర వ్యాప్తంగా మార్కెట్ కమిటీలకు సంబంధించిన కీలక మార్పులను ప్రభుత్వం అమలు చేస్తున్న నేపథ్యంలో, తాజా నిర్ణయం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

**మార్కెట్ కమిటీల కొత్త రూపు**

ఏపీలో వ్యవసాయ మార్కెట్ కమిటీలకు కొత్త ఉషస్సు తీసుకురావాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం కార్యాచరణ ప్రారంభించింది. రైతులకు మరింత పారదర్శకంగా సేవలందించేందుకు నూతనంగా నియమితులైన చైర్మన్లు పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు సమాచారం. ప్రస్తుత నియామక ప్రక్రియలో ప్రజాభిప్రాయ సేకరణను ప్రాధాన్యతనిచ్చి, అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించేలా నియామకాలు జరిగాయి. ప్రభుత్వ వర్గాల ప్రకారం, రాష్ట్ర వ్యాప్తంగా రైతుల సమస్యలను పరిష్కరించడంలో మార్కెట్ కమిటీలకు కీలక బాధ్యతలు అప్పగించనున్నారు.

**అధికార పక్షానికి ప్రాధాన్యత**

ఈసారి నియామకాలలో అధికార పక్షం అయిన టీడీపీకి పెద్దపీట వేయడం గమనార్హం. 47 మార్కెట్ కమిటీల చైర్మన్ పదవుల్లో 37 చోట్ల టీడీపీ నేతలే ఎంపిక కావడం అధికార పార్టీకి ఉన్న పట్టును రుజువు చేస్తోంది. జనసేనకు 8 చైర్మన్ పోస్టులు దక్కగా, బీజేపీకి కేవలం 2 చోట్లే అవకాశం కల్పించబడింది. మిగిలిన మార్కెట్ కమిటీలకు త్వరలోనే నియామక ప్రక్రియ పూర్తిచేయనున్నట్లు సమాచారం.

**మార్కెట్ కమిటీల కీలక పాత్ర**

రాష్ట్రంలోని మార్కెట్ కమిటీలు వ్యవసాయ రంగ అభివృద్ధికి కీలకంగా మారాయి. రైతులకు అనుకూలంగా విధానాలను అమలు చేయడం, ధరల స్థిరత్వాన్ని కాపాడటం, నకిలీ విత్తనాలు, ఎరువులపై నిఘా పెట్టడం వంటి బాధ్యతలు నూతనంగా నియమితులైన కమిటీ సభ్యులపై ఉన్నాయి. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు మార్కెట్ కమిటీలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని నిర్ణయించింది.

**అభ్యర్థుల ఎంపిక %-% ప్రజాభిప్రాయ సేకరణ**

ఈసారి అభ్యర్థుల ఎంపిక విధానంలో ప్రత్యేకత ఏమిటంటే, ప్రజాభిప్రాయ సేకరణ ఆధారంగా నియామకాలు చేపట్టడం. కూటమి ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలను గుర్తించి, స్థానికంగా ప్రజాదరణ కలిగిన నాయకులకు అవకాశం కల్పించడంపై దృష్టి పెట్టింది. దీని ద్వారా భవిష్యత్తులో ఎన్నికలపైన కూడా ప్రభావం చూపేలా వ్యూహం రూపొందించినట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**భవిష్యత్ వ్యూహాలు**

తాజాగా నియమితులైన మార్కెట్ కమిటీ చైర్మన్లు రాష్ట్రంలోని రైతుల సమస్యలను పరిష్కరించడంలో ఎంతవరకు ప్రభావం చూపగలరో పరిశీలించాల్సి ఉంది. ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయ విధానాలను సమర్థవంతంగా అమలు చేయడం, రైతులకు న్యాయమైన ధరలు అందించటం, నకిలీ విత్తనాలు, ఎరువులపై నిఘా పెట్టడం వంటి బాధ్యతలు వీరిపై ఉన్నాయి. కూటమి ప్రభుత్వం బలోపేతానికి ఈ నియామకాలను వ్యూహాత్మకంగా వినియోగించుకోవాలని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకత్వం భావిస్తోంది. భవిష్యత్తులో వ్యవసాయ రంగానికి ఈ కమిటీల ప్రభావం ఎలా ఉంటుందో చూడాలి.

# సంపాదకీయం

## కేంద్రంతో దక్షిణాది రాష్ట్రాలు అమీ తుమీ!

**జనసంఖ్య ప్రాతిపదికగా నియోజక వర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) జరుగుతుందనే ప్రకటనపై పార్లమెంట్‌లోనూ, బయటా దక్షిణాది రాష్ట్రాల వారు ప్రకంపనలు పుట్టిస్తున్నారు. ఎక్కువ జనాభా ఉన్న రాష్ట్రాలకు ఎక్కువ నియోజకవర్గాలు లభించే అవకాశం ఉండడంతో పార్లమెంట్‌లో తక్కువ జనాభా ఉన్న దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం గణనీయంగా తగ్గిపోతుంది. అదే సమయంలో జనాభా ఎక్కువ ఉన్న ఉత్తరాది రాష్ట్రాల ప్రాతినిధ్యం పెరుగుతుంది. ఇందువల్ల అధికారం, పరిపాలన, అభివృద్ధి వంటి అంశాల్లో దక్షిణాదికి తీరని అన్యాయం జరుగుతుందనీ, ఫలితంగా దక్షిణాదిలో అస్తిత్వ సంక్షోభం రాజుకుంటుందనేది నిపుణుల మాట.**

కుటుంబ నియంత్రణ నిక్కచ్చిగా పాటించడం వలన దక్షిణ భారత జనాభా ఉత్తర భారత జనాభా కంటే బాగా తగ్గిన సంగతి తెలిసిందే. నిజానికి దక్షిణ భారతం ప్రకృతి వనరులూ, మానవ వనరుల పరంగా ఉత్తరాదికన్నా శక్తిమంతంగా ఉంది. దీని అంతటికీ కారణం శతాబ్దాలుగా బౌద్ధ జీవన సాంస్కృతిక వికాసమేనని చెప్పక తప్పదు. ఉత్తర భారతంతో పోల్చినప్పుడు, దక్షిణ భారతం అహింసాత్మకంగా ఉంది. శాంతియుతంగా వుంది. విద్యాపరంగా బలంగా ఉంది. అక్షరాస్యతలో ముందు ఉంది. స్త్రీ విద్యలో ముందు ఉంది. చరిత్ర, సంస్కృతులను పరిశీలించినా దక్షిణాదికి ప్రత్యేక స్థానం ఉన్నట్లు స్పష్టమవుతుంది. రక్తపాత రహిత కుల నిర్మూలన ఉద్యమం కొనసాగుతోందిక్కడ. అతి ప్రాచీన భాషలు మాట్లాడే ఆదివాసీలు ఎందరో ఇక్కడ ఉన్నారు. శాతవాహనులు, విష్ణుకుండినులు, పల్లవులు, చోళులు, విజయనగరరాజులు. ఇలా ఎందరో రాజులు, చక్రవర్తులు ఈ నేల సుభిక్షం కావడానికి తమ యుద్ధనైపుణ్యాన్నీ, పాలనా చాతుర్యాన్నీ ప్రదర్శించారు.

ఈ రోజు ఢిల్లీ వాయు కాలుష్యంతో ఆక్సిజన్ లేక జీవన సంక్షోభంలో వుంది. దానికి ప్రత్యామ్నాయ రాజధాని వంటి హైదరాబాద్ దక్షిణాది నగరమే కదా. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆనాడే హైదరాబాద్‌ను రెండో రాజధానిగా చేసుకోమని చెప్పారు. హైదరాబాద్ ఇటు దక్షిణాది వారికి, అటు ఉత్తరాది వారికి, పశ్చిమ భారతానికీ సెంటర్‌గా ఉంటుందని కూడా ఆయన చెప్పారు. విద్య, సాంకేతిక రంగాల్లో దక్షిణ భారతదేశం ఇప్పటికే ముందు ఉంది. ఐటీ, సాఫ్ట్‌వేర్, సాంకేతిక ఉత్పత్తుల ఎగుమతుల్లో దక్షిణాది రాష్ట్రాలే ముందున్నాయి. అలాగే ప్రపంచంలోని ప్రఖ్యాత సంస్థల్లో మన తెలుగువారితోపాటు మిగతా దాక్షిణాత్యులే ప్రముఖ పాత్ర నిర్వహిస్తున్న సంగతీ తెలిసిందే. అరకొరగా ఉన్న వనరుల నుంచే ఈ స్థాయికి చేరారు మనవారు.

ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యపై కేంద్ర పెత్తనాన్ని పెంచే ప్రతిపాదన ముందుకు వచ్చింది. వర్సిటీలు, కళాశాలల్లో అధ్యాపకులు, బోధనా సిబ్బంది నియామకం, పదోన్నతికి కనీస అర్హతలు, ఉన్నత విద్యలో ప్రమాణాల నిర్వహణకు 'మార్గదర్శకాలు–2025' పేరిట విశ్వవిద్యాలయ నిధుల సంఘం (యూజీసీ) ఇటీవల ఒక ముసాయిదాను విడుదల చేసింది. అందులోని అంశాలు బాగా వివాదాస్పదమవు తున్నాయి. ఇప్పటిదాకా విశ్వవిద్యాలయాల అధిపతులైన ఉప కులపతుల నియామకం రాష్ట్ర ప్రభుత్వ అధికార పరిధిలో ఉంది.

నూతన ముసాయిదా ప్రకారం ఆ అధికారం ఛాన్స్‌లర్లుగా ఉన్న గవర్నర్ల చేతుల్లోకి వెళ్తుంది. ఈ మార్పును బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా నిరసిస్తున్నాయి. తమిళనాడు, కేరళ వంటివి నూతన ముసాయిదాను వ్యతిరేకిస్తూ చట్ట సభల్లో తీర్మానం కూడా చేశాయి. వైస్ ఛాన్స్‌లర్ల నియామక ప్రక్రియను కేంద్రం తన గుప్పిట్లోకి తీసుకోవడాన్ని అవి వ్యతిరేకిస్తున్నాయి. కేంద్ర చర్యలతో ఉన్నత విద్యపై తమ పట్టును పూర్తిగా కోల్పోవాల్సి వస్తుందని ఆయా రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికే కేంద్ర%–% రాష్ట్ర సంబంధాలు బలహీనమవ్వడం గమనార్హం.

ఈ పరిస్థితుల్లో డీలిమిటేషన్ అంశం ముందుకు రావడంతో దక్షిణాది రాష్ట్రాలు కేంద్రంతో అమీ తుమీ తేల్చుకోవడానికి సిద్ధమవుతున్నాయి. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ (%జవీ క్ఝుశ్రీఋఅ%) నిరసన గళాన్ని వినిపించడంలో ముందున్నారు. ఆయన చెన్నైలో ఏర్పాటు చేసిన సమావేశానికి దక్షిణ భారతానికి చెందిన బీజేపీయేతర పార్టీలు చాలావరకూ హాజరయ్యాయి. ఈ విషయంలో అన్నీ ఒకే విధమైన నిరసనను వ్యక్తం చేయడం స్వాగతించవలసిన విషయం. నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాదికి ఎటువంటి నష్టం రాదని కేంద్ర పాలకులు అంటున్నా... అది ఎలాగో ఇంతవరకూ వివరించలేదు. కేంద్రం సముచితంగా వ్యవహరించకపోతే దేశంలో అశాంతి రేగే ప్రమాదాన్ని చెన్నై సమావేశ ధోరణి చూస్తే అర్థమవుతుంది.

## వచ్చేనెలలో థాయ్ లాండ్, శ్రీలంకలకు మోడీ పర్యటన

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడీ వచ్చేనెల (ఏప్రిల్)లో విదేశీ పర్యటనకు థాయ్ లాండ్, శ్రీలంక దేశాలకు వెళ్లనున్నారు. ఏప్రిల్ 3–4 తేదీల్లో థారులాండ్ ఆతిథ్యం ఇస్తున్న ఆరవ బిఐఎంఎస్‌టిఇసి (బేఆఫ్ బెంగాల్ ఇన్షియేటివ్ ఫర్ మల్టి సెక్టోరల్ టెక్నికల్ అండ్ ఎకానమిక్ కో ఆపరేషన్) శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనగడానికి బ్యాంకాక్‌లో పర్యటించనున్నట్లు భారత విదేశాంగ మంత్రిత్వశాఖ శుక్రవారం వెల్లడించింది. అనంతరం మోడీ ఏప్రిల్ 4–6 వరకు శ్రీలంకలో పర్యటించనున్నారు. మూడురోజుల పర్యటనలో భాగంగా ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలపై కొలంబోలో శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకతో మోడీ చర్చలు జరపున్నట్లు భారత విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వశాఖ తెలిపింది.



## త్రిభాషా సూత్రం, డీలిమిటేషన్‌పై విజయ్ పార్టీ కీలక తీర్మానం

### తిరువన్మయూర్ లో టీవీకే పార్టీ తొలి జనరల్ కౌన్సిల్ సమావేశం
### సమావేశానికి హాజరైన పార్టీ అధినేత విజయ్
### మొత్తం 17 తీర్మానాలను ఆమోదించిన టీవీకే

జాతీయ విద్యావిధానంలోని త్రిభాషా సూత్రాన్ని, నియోజవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్)ను తమిళ పార్టీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే. కేంద్ర ప్రభుత్వంపై ద్రవిడ పార్టీలు విమర్శలు గుప్పిస్తున్నాయి. తాజాగా త్రిభాషా సూత్రాన్ని, డీలిమిటేషన్ ను వ్యతిరేకిస్తూ సినీ హీరో విజయ్ పార్టీ తమిళగ వెట్రి కళగం (టీవీకే) తీర్మానాలు చేసింది. తమిళనాడులోని తిరువన్మయూర్ లో ఈరోజు టీవీకే తొలి జనరల్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సమావేశంలో పార్టీ అధినేత విజయ్ కూడా పాల్గొన్నారు. ఈ సమావేశంలో వక్ఫ్ సవరణ బిల్లుతో సహా మొత్తం 17 తీర్మానాలను పార్టీ ఆమోదించింది. జాతీయ విద్యావిధానంలోని మూడు భాషల విధానం ఫెడరలిజానికి విరుద్ధమని పార్టీ అభిప్రాయపడింది. త్రిభాషా సూత్రాన్ని తాము అంగీకరించేది లేదని తెలిపింది. డీలిమిటేషన్ తో దక్షిణాది రాష్ట్రాల్లో సీట్లు తగ్గుతాయని చెప్పింది. డీలిమిటేషన్ ను వ్యతిరేకిస్తామని చెప్పింది. ఇదే సమయంలో డీఎంకే ప్రభుత్వంపై విమర్శలు గుప్పించింది. ఉద్యోగుల పాత పెన్షన్ పథకంపై ప్రభుత్వం తప్పుడు వాగ్దానాలు చేసిందని విమర్శించింది. రాష్ట్రంలో డ్రగ్స్ వాడకం పెరిగిపోయిందని, దీన్ని నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమయిందని దుయ్యబట్టింది. శ్రీలంక అరెస్ట్ చేసిన భారతీయ మత్స్యకారుల అంశంపై స్పందిస్తూ... మత్స్యకారులకు టీవీకే అండగా ఉంటుందని తెలిపింది.



## మంత్రి లోకేష్‌ను కలిసి 11 ఏళ్ల టెక్ పిడుగు అఖిల్

అమరావతి మార్చి 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఏపీ కి చెందిన 11 ఏళ్ల టెక్ పిడుగు అఖిల్ ఆకెళ్ల టెక్నాలజీ రంగంలో అద్భుతమైన ప్రతిభ కనబరుస్తున్నారు. ఈ క్రమంలో ఈరోజు(శుక్రవారం) విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌ను అఖిల్ ఆకెళ్ల కలుసుకున్నారు. ఉండవల్లిలోని నివాసంలో తన తండ్రితో కలిసి మంత్రి నారా లోకేష్‌తో సమావేశమయ్యారు. యూకేలో విద్యను అభ్యసిస్తున్న 11 ఏళ్ల అఖిల్.. చిన్న వయసులోనే టెక్నాలజీ రంగంలో అద్భుత ప్రతిభను కనబరుస్తున్నాడు.



**టెక్నాలజీలో అద్భుత ప్రతిభను కనబరుస్తున్న అఖిల్**

ఈ రంగంలో ఎన్నో మైలురాళ్లను సాధించాడు. మైక్రోసాఫ్ట్ ధృవీకరించిన అజ్యూర్, డేటా, సెక్యూరిటీతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫౌండేషన్ కోర్సుల్లో సర్టిఫికేషన్లు పొందాడు. యూకేలో నిర్వహించిన పలు టెక్ సమ్మిట్‌లలో పాల్గొన్నాడు. అమరావతిలో జరగనున్న సమాచార, సాంకేతిక అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యేందుకు అఖిల్ ఆసక్తి చూపించడంతో త్వరలోనే కలుస్తానని మంత్రి లోకేష్ హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం అఖిల్‌ను కలుసుకున్నారు. టెక్నాలజీలో అద్భుత ప్రతిభను కనబరుస్తున్న అఖిల్‌ను ఈ సందర్భంగా మంత్రి లోకేష్ అభినందించారు. ముందు ముందు మరిన్ని విజయాలు అందుకోవాలని మంత్రి అన్నారు.



**కోడింగ్ నైపుణ్యాలతో ఆరు మైక్రోసాఫ్ట్ ఐటీ సర్టిఫికేట్లు**

కాగా, కరోనా మహమ్మారితో ప్రపంచం మొత్తం అతలాకుతలం అవుతున్న సమయంలో అఖిల్ ఆకెళ్ల ప్రతిభ వెలుగులోకి వచ్చింది. కొవిడ్ లాక్ డౌన్ సమయంలో కోడింగ్ నైపుణ్యాలతో ఆరు మైక్రోసాఫ్ట్ ఐటీ సర్టిఫికేట్లు సాధించుకున్నాడు. ఇండస్ట్రీ అవసరాలకు తగినట్లుగా ఏఐ సొల్యూషన్స్ అందిస్తూ ఉంటారు. క్లౌడ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మీద ఆసక్తి ఎక్కువ ఉన్న అఖిల్ ఆకెళ్ల.. 2025లో జరిగే టెక్ షోలో పాల్గొనాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మరోవైపు కొవిడ్ లాక్‌డౌన్ సమయంలో పిల్లల కోసం స్క్రాచ్ పేరుతో ఉచిత కోడింగ్ ప్లాట్‌ఫామ్ రూపొందించారు. సొంతంగా ఆన్‌లైన్ గేమ్స్ తయారు చేసుకోవడంతో పాటుగా యానిమేషన్‌ల ద్వారా పాత్రలకు ప్రాణం పోస్తుంటాడు.

## మండిపోతున్న ఏపీ..

నమోదు కాగా గుర్రంపోడులో రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రత 41.0 డిగ్రీల సెల్సియస్? నమోదు అయింది. మరోవైపు నల్గొండ జిల్లాలో 36 ప్రాంతాల్లో ఆరెంజ్? హెచ్చరిక స్థాయిలో 40 డిగ్రీల పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాగా ఏడు ప్రాంతాల్లో రాష్ట్రంలోనే రెండో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదుయ్యాయి. ఇందులో సూర్యాపేట జిల్లాలో 11 ప్రాంతాలు, యాదాద్రి జిల్లాలో 10 ప్రాంతాల్లో 40 డిగ్రీల పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ ఉష్ణోగ్రతలు రాబోయే మూడు రోజులు మరింత పెరిగే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ ఉష్ణోగ్రతలు రాష్ట్రవ్యాప్తంగా ఇలానే ఉన్నాయి. జనాలు ఉక్కపోతతో అల్లాడుతున్నారు.

## మయన్మార్, బ్యాంకాక్‌లలో భారీ భూకంపం..

నివేదికలు పేర్కొన్నాయి. ఇక ఈ భూకంపం కారణంగా పొరుగున ఉన్న థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో తీవ్ర ప్రకంపనలు సంభవించాయి. దీంతో అక్కడ కొన్ని మెట్రో, ఇతర రైలు సేవలు నిలిపివేశారు. అలాగే చైనాలోని యునాన్ ప్రావిన్స్‌లో కూడా ప్రకంపనలు సంభవించాయని బీజింగ్ భూకంప సంస్థ తెలిపింది. థాయ్ ప్రధాని పేటోంగ్టార్న్ షినవత్రా పరిస్థితిని సమీక్షించడానికి ఎమర్జెన్సీ మీటింగ్ నిర్వహిస్తున్నారు. యున్నాన్‌లో సంభవించిన భూకంపం రిక్టర్ స్కేలుపై 7.9 తీవ్రతను నమోదు చేసిందని చైనా భూకంప నెట్‌వర్క్ సెంటర్ వెల్లడించింది.

## దేశానికి మరో 40 ఏళ్ల వరకూ ఆ సమస్య లేదు : సిఎం చంద్రబాబు

చెప్పారు. ఆర్థిక సంస్కరణలు దేశ ముఖ చిత్రాన్ని సమూలంగా మార్చేశాయన్నారు. 1991లో తీసుకొచ్చిన సంస్కరణలు ఎంపిక కాదు.. తప్పనిసరి అని సిఎం తెలిపారు. రాజకీయ సంస్కరణలతో సోవియట్ రష్యా అనేక దేశాలుగా విడిపోయిందని అదే సమయంలో చైనా ఆర్థిక సంస్కరణలు ప్రారంభించిందని ఆ తర్వాత ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆ దేశం ఎదిగింది అని చెప్పారు. భారత్ కూడా సంస్కరణల తర్వాత అభివఅద్ధి బాట పట్టిందన్నారు. బ్రిటిష్‌వారు మన దేశం నుంచి అంతా తీసుకెళ్లారనీ, ఒక్క ఇంగ్లీష్‌ను మనకు వదిలేశారని విమర్శించారు. 1990లలో కమ్యూనికేషన్ రంగంలో బీఎస్ఎన్ఎల్, వీఎస్ఎన్ఎల్ గుత్తాధిపత్యం ఉండేదని తెలిపారు. ఆర్థిక సంస్కరణల తర్వాత కమ్యూనికేషన్ల రంగంలో ప్రైవేటు సంస్థల రాక ఓ గేమ్ ఛేంజర్ అని అభివర్ణించారు. మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్‌ను మొదట కలుస్తానని అడిగినప్పుడు రాజకీయ నేతలతో సంబంధం లేదని చెప్పారు. ఆయన్ను ఒప్పించి అపాయింట్‌మెంట్ తీసుకున్నానన్నారు. 45 నిమిషాలు తనతో మాట్లాడారని తెలిపారు. హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ సంస్థ నెలకొల్పాలని కోరానన్నారు. ఇప్పుడు అదే సంస్థకు సీఈవోగా తెలుగు వ్యక్తి సత్య నాదెళ్ల ఉన్నారని సిఎం తెలిపారు. కొంతకాలంగా భారత్ వఅద్ధిరేటు ప్రపంచంలోనే అత్యధికంగా ఉంటోందన్నారు. 2014లో మనది పదో ఆర్థిక వ్యవస్థ అని, ఇప్పుడు ఐదో స్థానానికి చేరిందని చెప్పారు. భారత్‌కు ఉన్న గొప్పవరం జనాభా అని, డెమోగ్రాఫిక్ డివిడెండ్ అని అన్నారు. మనమంతా కఅషి చేస్తే త్వరలోనే ప్రపంచంలో భారత్ అగ్రస్థానానికి చేరుకుంటుందని అన్నారు. చాలా దేశాలు జనాభా తగ్గుదల సమస్యను ఎదుర్కొంటున్నాయని, మన దేశానికి మరో 40 ఏళ్ల వరకూ ఆ సమస్య లేదు అని చంద్రబాబు ప్రసంగించారు.

## పాస్టర్ ప్రవీణ్ మృతి కేసులో దర్యాప్తు వేగవంతం

దృష్టి పెట్టారు.. ఇంతకుముందు బైక్ వెనుక ఐదు వాహనాలు వెళ్లినట్లు సీసీ ఫుటేజ్ రికార్డింగ్ తేల్చగా.. ఈ వాహనాల గురించి వివరాలను సేకరించే ప్రక్రియ కొనసాగుతోంది. అయితే, పాస్టర్ ప్రవీణ్ మృతిపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తామని తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ ఇప్పటికే ప్రకటించారు. ప్రవీణ్ చనిపోవడానికి ముందు సీసీ కెమెరా దృశ్యాలు దర్యాప్తులో కీలకంగా మారాయన్నారు. కాగా, పాస్టర్ ప్రవీణ్ కుమార్.. సికింద్రాబాద్‌లో నివాసం ఉండేవారు.. తూర్పు గోదావరి జిల్లా చాగల్లులో జరిగే క్రైస్తవ సభలకు హాజరయ్యేందుకు సోమవారం సాయంత్రం ఆయన తన బైక్‌పై బయల్దేరారు. మంగళవారం ఉదయం రాజమండ్రి సమీపంలోని కొంతమూరు వద్ద రోడ్డు పక్కన విగతజీవిగా పడి ఉన్నారు.

అయితే, బైక్ బ్యాలెన్స్ తప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లడం.. ఆయన ముందుగా పడిపోయిన తర్వాత.. ఆయన పైన బైక్ పడడంతో మృతిచెంది ఉంటారని ప్రాథమికంగా అంచనా వేశారు.. కానీ, ప్రవీణ్ పగడాల మృతిపై క్రిస్టియన్ సంఘాలు అనుమానాలు వ్యక్తం చేయడం.. ఆందోళనకు దిగడంతో పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు..

తెలుగురాష్ట్రం దినపత్రిక

జనరల్ న్యూస్


https://epaper.teluguraastram.com

అమలాపురం
మార్చి 29,
శనివారం 2025



# అపర భగీరధుడు.. చంద్రబాబు నాయుడు

## -టిడిపి నాయకులు సత్తిరాజు స్వామి




**రాజోలు, మార్చి 28 (తెలుగురాష్ట్రం విలేకరి):** ఆంధ్రప్రదేశ్ పాలిట అపర భగీరధుడు చంద్రబాబు నాయుడు అని తెలుగుదేశం నాయకులు, ప్రముఖ న్యాయవాది సత్తిరాజు స్వామి అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాకతో ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్ట్ పనులు పరుగులు పెడుతున్నాయని స్వామి సంతోషం వ్యక్తం చేశారు. గోదావరి పుష్కరాలకు ముందే పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తామని చంద్రబాబు ప్రకటించడం పట్ల ఆయన హర్షం వెలిబుచ్చారు. శుక్రవారం నాడు స్వామి రాజోలులో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా తీసుకుని పని చేస్తున్నారని అన్నారు. ప్రతి సోమవారం పోలవారంగా పెట్టుకుని 2019కి ముందే 70 శాతం ప్రాజెక్ట్ నిర్మాణ పనులు చంద్రబాబు పూర్తి చేస్తే జగన్ హయాంలో అహంభావం, రాజకీయ కక్షతో ప్రాజెక్టుకు నష్టం కలిగించారని స్వామి విమర్శించారు. ఈ ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు ప్రాజెక్టు నుంచి నీళ్లు విడుదల చేయకముందే పునరావాసం పూర్తి చేస్తామని, 2027 డిసెంబరు నాటికి పోలవరాన్ని పూర్తి చేస్తామని సీఎం ప్రకటించడం హర్షణీయమని అన్నారు. 2019లో టీడీపీ ప్రభుత్వమే మళ్లీ వచ్చి ఉంటే 2020కే ప్రాజెక్టు పూర్తయ్యేదన్నారు. వైసీపీ పాలకులు దీనికి ఏ గతి పట్టించారో చూశామని, ఆలస్యం చేయడం వల్ల ఖర్చు భారీగా పెరిగిపోయిందని చెప్పారు. డయాఫ్రం వాల్ దెబ్బతిన్నా ఎవరికీ తెలియలేదని, కాఫర్ డ్యాం సకాలంలో పూర్తి చేసి ఉంటే ఈ నష్టం జరిగేది కాదని అన్నారు. పోలవరం ప్రాజెక్టు అథారిటీ, కేంద్రం ముందే చెప్పినా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదని, ఒక్కసారి వైసీపీకి ఓట్లేసినందుకు రాష్ట్రానికి జీవనాడి దెబ్బ తినే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వం ఇచ్చిన పరిహారం సరిపోదని, ప్రతిపక్షంలో ఉన్న జగన్ రూ.10 లక్షలు పరిహారం ఇస్తానన్నాడని, గద్దెనెక్కాక రూపాయి కూడా ఇచ్చింది లేదని విమర్శించారు. కనీసం వరదలు వచ్చినప్పుడు నిర్వాసితులను పట్టించుకోలేదని స్వామి ఆరోపించారు. వైసీపీ హయాంలో పోలవరానికి కేంద్రం ఇచ్చిన నిధులను గత పాలకులు ఇతర అవసరాలకు మళ్లించారని తప్పుబట్టారు. పోలవరం పూర్తయితే ఉభయ గోదావరి జిల్లాలలోని మెట్ట ప్రాంతంతో బాటు రాష్ట్రంలోని లక్షలాది ఎకరాల బీడు భూములు సస్యశ్యామలం అవుతాయని స్వామి చెప్పారు. నదుల అనుసంధానంతో ఆంధ్రప్రదేశ్ ప్రగతికి చంద్రబాబు బాటలు వేస్తున్నారని తెలిపారు. వైసీపీ పాలన ఐదేళ్ల విధ్వంసం నుండి రాష్ట్రం కోలుకోవాలంటే చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ నాయకత్వంను మరింత బలోపేతం చేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని స్వామి చెప్పారు.



## కలశ పున ప్రతిష్ఠ కార్యక్రమానికి
# స్పీకర్ అయ్యన్నకు ఆహ్వానం



**విశాఖపట్నం మార్చి 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

**నర్సీపట్నం మున్సిపాలిటీ బలిఘట్టం శ్రీరమా సహిత వీర వేంకట సత్యనారాయణ స్వామి వారి ఆలయం వద్ద ఏప్రిల్ 12వ తేదీ శనివారము ఉదయం గం. 11.25ని.లకు కలశ పున్న ప్రతిష్ట కార్య క్రమము నిర్వహించనున్నారు.**

దేవాలయ శిఖరముపై గల కలశము కింద పడిపోయిన కారణంగా, సదరు కలశమును పున్న ప్రతిష్ట చేయవలసిన అవసరం ఏర్పడింది. ఈ నేపథ్యంలో దేవస్థానం వైధిక కమిటీ నిర్ణయముచే నిష్ణాతులైన వేద పండి తులు, ఋత్వికులతో కలశ పున్న ప్రతిష్ట కార్యక్రమ ము నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమానికి స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆహ్వానించుటకు అన్నవరం దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్.రామ్ మోహన్ రావు, సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం, అప్పారావు, బలిఘట్టం సత్యనారాయణ స్వామి ఆలయ ధర్మకర్త శెట్టి మోహన్, ఆలయ అర్చకులు భద్రాచల రామం కలిసి ఆహ్వానించారు.

# భావ ప్రకటనా స్వేచ్ఛను రక్షించడం కోర్టుల విధి

## కాంగ్రెస్ ఎంపీ వీడియో కేసులో సుప్రీం వ్యాఖ్యలు

**దిల్లీ: "ఓ వ్యక్తి అభిప్రాయాలను ఎక్కువమంది వ్యతిరేకించినా సరే.. ఆ వ్యక్తి భావ ప్రకటనా హక్కును తప్పనిసరిగా గౌరవించాల్సిందే" అని సుప్రీంకోర్టు వెల్లడించింది. కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్‌గర్హి వివాదాస్పద వీడియో పోస్ట్‌కు సంబంధించిన కేసుపై విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. వాక్ స్వాతంత్ర్యం అనేది ప్రజాస్వామ్య వ్యవస్థలో అంతర్భాగమని, దాన్ని రక్షించడం కోర్టుల విధి అని స్పష్టంచేసింది. అసలేం జరిగిందంటే..**



గుజరాత్‌కు చెందిన కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్‌గర్హి గతేడాది డిసెంబరులో తన ఎక్స్ ఖాతాలో ఓ వీడియో పోస్ట్ చేశారు. 46 సెకన్ల నిడివి ఉన్నా వీడియోలో ఇమ్రాన్ ఓ పెళ్లి వేడుక మధ్యలో నడిచివస్తుండగా ఆయనపై పూలవర్షం కురిసింది. బ్యాక్‌గ్రౌండ్ ఓ పద్యం వినిపించింది. అయితే, ఆ పద్యంలోని పదాలు రెచ్చగొట్టేలా ఉన్నాయని, మత విశ్వాసాలు, సామరస్యాన్ని, జాతి ఐక్యతను దెబ్బతీసేలా ఉన్నాయని ఆరోపణలు వచ్చాయి. ఈక్రమంలోనే ఆయనపై కేసు నమోదైంది.

ఈ కేసును కొట్టివేయాలని కాంగ్రెస్ ఎంపీ గుజరాత్ హైకోర్టును ఆశ్రయించగా.. ఆయన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టేసింది. దీన్ని సవాల్ చేస్తూ ఆయన సుప్రీంకోర్టుకు వెళ్లారు. దీనిపై తాజాగా విచారణ చేపట్టిన జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం.. గుజరాత్ పోలీసుల తీరుపై అసహనం వ్యక్తంచేసింది. ఎలాంటి నేరం లేకపోయినా.. అత్యుత్సాహం ప్రదర్శించారని వ్యాఖ్యానించింది. ఈసందర్భంగా వాక్ స్వాతంత్ర్యంపై ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది.

"కవిత్వం, నాటకం, సినిమాలు, వ్యంగ్యం, కళలు, సాహిత్యం వంటివి మనుషుల జీవితాన్ని మరింత అర్థవంతం చేస్తాయి. ఆలోచనలు, అభిప్రాయాలను వ్యక్తీకరించే స్వేచ్ఛ లేనప్పుడు.. ఆర్టికల్ 21 ప్రకారం గౌరవప్రదమైన జీవితాన్ని గడపడం అసాధ్యం. ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్య వ్యవస్థలో.. విభిన్న అభిప్రాయాలను.. ప్రతివాదనలతో ఎదుర్కోవాలే తప్ప అణచివేతతో కాదు. ఒకవేళ ఆ వ్యాఖ్యలపై ఆంక్షలు విధించాల్సివస్తే.. అవి సహేతుకంగా ఉండాలే గానీ.. ఊహాజనితంగా కాదు. ఓ వ్యక్తి అభిప్రాయాలను ఎక్కువమంది వ్యతిరేకించినా సరే.. ఆ వ్యక్తి భావ ప్రకటనా హక్కును తప్పనిసరిగా గౌరవించాల్సిందే. వాక్ స్వాతంత్ర్యం అనేది ప్రజాస్వామ్యంలో అంతర్భాగం. ప్రజల ప్రాథమిక హక్కును కాపాడటం న్యాయస్థానాల విధి" అని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ కేసులో కాంగ్రెస్ ఎంపీపై నమోదైన కేసును సుప్రీంకోర్టు కొట్టేసింది

## నర్సీపట్నం మెప్మా సిబ్బందికి
# వరల్డ్ రికార్డు యూనియన్ సర్టిఫికేట్లు



నర్సీపట్నం పురపాలక పరిధిలో మెప్మా సిబ్బందికి ఎస్‌హెచ్‌జీ సభ్యులు తయారు చేసే ఉత్పత్తులు ఓఎన్‌డిసి ఆన్లైన్ ప్లాట్‌ఫామ్ ద్వారా మార్చి 8వ తేదీన కొనుగోలు లక్ష దాటిన సందర్భంగా మూడు వరల్డ్ రికార్డ్సు యూనియన్ సర్టిఫికేట్లు అందాయి. ఈ మేరకు గురువారం నర్సీపట్నం స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు మెప్మా సిబ్బందికి ఆ రికార్డులను అందజేసి అభినందనలు తెలియజేశారు.

ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ప్రతీ ఇంటికి ఒక మహిళా వ్యాపారవేత్తగా తయారు చేయాలనే ప్రభుత్వం ఆశయాన్ని ప్రతి సభ్యురాలు వినియోగించుకోవాలని సూచించారు. మెప్మా సిబ్బంది ప్రతి వార్డులో సభ్యులకు అవగాహన కల్పించి, ఆన్లైన్ బిజినెస్ ద్వారా ఉత్పత్తులను మార్కెట్ చేసి, ఉపాధి అవకాశాలను పెంపొందించి అధిక ఆదాయం పొందేలా మహిళలు ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఓలుగా బి. రమాదేవి, భాస్కర్, భాను, నూకరత్నం, శ్రీదేవి, సిఎల్‌ఆర్పీలు వరలక్ష్మి, సునీత, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# అమెరికా పర్యటనకు రాహుల్ గాంధీ..!

**అమెరికా : కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అమెరికా పర్యటనకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ మేరకు పార్టీ వర్గాలు వెల్లడించినట్లు ఆంగ్ల మీడియాల్లో కథనాలు వస్తున్నాయి.**



కథనాల ప్రకారం.. ఏప్రిల్ 19 నుంచి రాహుల్ అగ్రరాజ్యంలో పర్యటిస్తారు. ఈసందర్భంగా ఆయన బ్రౌన్ యూనివర్సిటీని సందర్శిస్తారు. బోస్టన్‌లో ప్రవాస భారతీయులతోనూ ఆయన భేటీ అయ్యే అవకాశం ఉంది. అయితే, ఆయన యూఎస్‌లో ఎన్ని రోజులు పర్యటిస్తారనేది తెలియదు. అంతేకాక.. దీనిపై పార్టీ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన లేదు. ఇక, గతేడాది సెప్టెంబరులో మూడ్రోజులు రాహుల్ యూఎస్‌లో పర్యటించారు. ఆ సమయంలో ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో రిజర్వేషన్లు, భారత్‌లో మత స్వేచ్ఛ వంటి అంశాలపై రాహుల్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ప్రస్తుతం భారత్‌లో ఆదివాసీలు, దళితులు, ఓబీసీలకు సరైన ప్రాధాన్యం దక్కడం లేదని రాహుల్ అన్నారు. అప్పటివరకు అభివృద్ధిలో వారి భాగస్వామ్యం కూడా అంతంతమాత్రంగానే ఉంటుందని, దేశంలో అన్నివర్గాల వారికీ పారదర్శకంగా అవకాశాలు లభించే పరిస్థితులు వచ్చిన తర్వాతే రిజర్వేషన్ల రద్దు గురించి తమ పార్టీ ఆలోచిస్తుందన్నారు. ఇక, సిక్కులను ఉద్దేశిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. భాజపా ఆయన మాటలను ఖండించింది. విదేశాల్లో భారత్ పరువుతీస్తున్నారని మండిపడింది. సిక్కులను ఉద్దేశిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా.. భాజపా మద్దతున్న ఒక గ్రూప్ దిల్లీలోని సోనియాగాంధీ నివాసం వెలుపల నిరసనలు సైతం తెలియచేసింది.




డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

తెలుగురాష్ట్రం దినపత్రిక

https://epaper.teluguraastram.com

శనివారం 29 మార్చి 2025

# భద్రాచలానికి ప్రత్యేక బస్సులు



**అమలాపురం, మార్చి 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
ఏప్రిల్ 6వ తేదీ శ్రీరామనవమి నాడు భద్రాచలంలో జరగబోవు శ్రీ సీతారామ కళ్యాణంను పురస్కరించుకొని అమలాపురం డిపో నుండి 5వ తేదీ శనివారం ఉదయం 8.30 గంటల నుండి రాత్రి 8.30 గంటల వరకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయడం జరిగిందని డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణ మూర్తి తెలిపారు. ఏప్రిల్ 6వ తేదీ కళ్యాణం పూర్తయిన తర్వాత భద్రాచలం నుండి అమలాపురం రావడానికి మధ్యాహ్నం1.30 నుండి రాత్రి 7 గంటల వరకు ప్రతి అరగంటకు సాధారణ చార్జీలతో ప్రత్యేక బస్సులు నడపబడునని తెలిపారు. వీటికి ఆన్లైన్లో అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం కలదని, వివరాలకు ఫోన్ నెంబర్ 9959225576లో సంప్రదించాలని తెలిపారు. భక్తులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని డిపో మేనేజర్ సిహెచ్ఎస్ఎన్ మూర్తి తెలిపారు.

## ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్

# నూతన కార్యవర్గం ఎంపిక

### అధ్యక్ష కార్యదర్శులుగా రాజశేఖర్,స్వామి



**మలికిపురం, మార్చి 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాజోలు నియోజకవర్గ నూతన కమిటిని ఏకగ్రీవకంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లా రాజోలు పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శుక్రవారం జిల్లా కన్వీనర్ శ్రీనివాస్ అధ్యక్షతన ఏపీ డబ్ల్యూజేఎఫ్ రాజోలు నియోజకవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏకగ్రీవంగా రాజోలు నియోజకవర్గ ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నూతన కమిటిని ఎన్నుకున్నారు . రాజోలు నియోజకవర్గ అధ్యక్షునిగా పీతల రాజశేఖర్,కార్యదర్శిగా గాలిదేవర స్వామి,కోశాధికారిగా చింతా మధు కుమార్, ఉపాధ్యక్షులుగా బత్తుల మురళీకృష్ణ, ఆరేటి చంటి,సహాయ కార్యదర్శిగా రాపాక ప్రభుశేఖర్,రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ గా కారుపల్లి శ్రీనువాస్ కార్యవర్గ సభ్యులుగా ఇంజేటి రఘు ,హరి,దుర్గాప్రసాద్ లు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. తమ ఎంపికకు కృషిచేసిన పెడరేషన్ రాష్ట్ర నాయుకులు నవీన్ ,జె.శ్రీనివాస్ లకు నూతన కార్యవర్గం కృతజ్ఞతలు తెలిపింది. జర్నలిస్టుల సంక్షేమానికి నిరంతరం కృషిచేస్తామని నూతన కమిటీ అధ్యక్షులు పీతల రాజశేఖర్ తెలిపారు. ఈ సమావేశంలో నూతన సభ్యత్వాల నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ సభ్యులతో పాటుగా పలువురు జర్నలిస్టుల పాల్గొన్నారు.

# హామీలు నెరవేరేస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్



**మలికిపురం, మార్చి 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
మలికిపురం మండలంలో
కోటి 53 లక్షలతో 4 వాటర్ ట్యాంక్ ల ప్రారంభోత్సవం ఎన్నికలలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా శాసన సభ్యులు దేవ వరప్రసాద్ నెరవేరుస్తున్నారు. అప్పటి ఎన్నికల ప్రచారంలో భాగంగా రాజోలు నియోజకవర్గం లో మంచి నీటి సమస్య తీవ్రంగా ఉంది అని తీర ప్రాంతాలలో ఈ సమస్య మరింత జటిలంగా ఉందని కానీ పక్కా ప్రణాళిక తో వెలితే ఈ సమస్య పరిష్కారం అవుతుందని జల జీవన్ మిషన్ నిధులను జగన్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని తెలిపారు.ఆ మాట ప్రకారమే నేడు 26 వాటర్ ట్యాంక్ లు రాజోలు నియోజకవర్గానికి శాంక్షన్ కాగా 19 వాటర్ ట్యాంక్ లు ప్రజలకు అందుబాటులోనికి తీసుకొని వచ్చారు. మిగతా 7 వాటర్ ట్యాంక్ లు కూడా త్వరలో ప్రారంభం కానున్నాయి. ప్రతి ఇంటింటి కుళాయి ఇవ్వాలి అనే లక్ష్యం తో పనిచేస్తున్న అని తెలిపారు. కరెంట్ సమస్యను పరిష్కరించడం ద్వారా మరింత సమర్థవంతంగా ప్రతి గ్రామానికి మంచినీరు అందించవచ్చని దానికి అనుగుణంగా నూతన సబ్ స్టేషన్ ల నిర్మాణానికి ప్రతిపాదనలను పంపాను అని తెలియజేశారు. కోటి 53 లక్షల వ్యయంతో గుడిమెల్లంక ( %ు%. సావరం) మట్టపర్రు (తాడి వారి గ్రూప్) బట్టెలంక (రామదాసు పాలెం)తూర్పు పాలెం (కాలనీ) లలో ట్యాంక్ లను దేవ వర ప్రసాద్ గారు ప్రారంభోత్సవం చేశారు.ఈ ప్రారంభోత్సవానికి గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్ట్ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ హాజరు అయ్యారు.ఈ కార్యక్రమంలో మలికిపురం ఎంపీపీ మేడిచర్ల సత్యవాణిరాము,అంతర్వేది దేవస్థానం ఉత్సవ కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, రాజోలు నియోజవర్గం పోలింగ్ బూత్ కమిటీల కోఆర్డినేటర్ చాగంటి స్వామి, మలికిపురం మండల జడ్పీటీసీ బళ్ళ ప్రసన్న కుమారి, మలికిపురం మండల టిడిపి అధ్యక్షులు అడబాల యుగంధర్, మలికిపురం మండలం జనసేన పార్టీ అధ్యక్షులు మల్లిపూడి సత్తిబాబు, మలికిపురం మండల పంచాయతీ సర్పంచ్ ల సమాఖ్య అధ్యక్షులు యెనుముల నాగు,గుడిమెల్లలంక సర్పంచ్ నల్లి విజయకుమారి, మట్టపర్రు సర్పంచ్ కడలి దుర్గదేవి రాజేష్,విశేశ్వరాయపురం సర్పంచ్ చెల్లుబోయిన హేలిన దేవి,బట్టేలంక సర్పంచ్ బోణం సీతారత్నం అర్జున్ రావు,ఎంపీటీసీ,నల్లి అంజిలి దేవి,మలికిపురం ఎంపీటీసీ జక్కంపూడి శ్రీదేవి,బట్టెలంక ఎంపీటీసీ ఆవుపాటి శివజ్యోతి సుబ్రహ్మణ్యం,చెల్లింగి అబ్బులు,మ%శీ%గెన భూదేవి,బందెల పద్మ, ముత్యాల దుర్గ దేవి,ముదునూరి శ్రీనివాస్ రాజు,గంటా నాయుడు,చక్రవర్తి,బోణం సాయి,దొంగ శ్రీనివాస్,చెల్లుబోయిన చిన్న సత్యనారాయణ,చెల్లుబోయిన నాగ మల్లేశ్వరరావు,బోణం చంటి,ఎన్డీఏ కూటమి నాయకులు ఆర్డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.



# కోనసీమ తిరుమల ఆలయంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు.



**ఆత్రేయపురం మార్చి 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
కోనసీమ తిరుమల, ఏడు వారాల వెంకన్నగా ప్రసిద్ధిగాంచిన వాడపల్లి వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో శుక్రవారం శాసనసభ్యులు బండారు సత్యానందరావు పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. నూతనంగా ఏర్పాటు చేసిన రూ.50 రూపాయల క్యూలైన్ వారధిని, అలాగే నూతనంగా ఏర్పాటు చేసిన పేవర్ బ్లాక్ ఉచిత క్యూలైన్ ను ప్రారంభించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సత్యానందరావు కు ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో కరుటూరి నరసింహారావు, ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్), కాయల జగన్నాధం కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి పై సమగ్ర విచారణ చేపట్టాలి.

### హజరిగింది ప్రమాదం కాదు హత్య.


### -కొత్తపేట నియోజకవర్గ పాస్టర్ల ఫెల్లోషిప్ డిమాండ్.

**ఆత్రేయపురం మార్చి 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
ఉభయ తెలుగు రాష్ట్రాల్లో, క్రైస్తవ సమాజంలో పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి తీరని లోటు, ఒక ధ్రువతార రాలిపోయిందని కొత్తపేట నియోజకవర్గ పాస్టర్ల ఫెల్లోషిప్ అధ్యక్షులు అన్నారు. ఆయన మృతికి సంతాపంగా సిడబ్ల్యూఎస్, ఇవాంజెలికల్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో జరిగిన శాంతి ర్యాలీలో వేలాదిగా క్రైస్తవులు పాల్గొని, కొవ్వొత్తులు వెలిగించి ఆత్రేయపురం గ్రామంలో స్థానిక లూథరన్ చర్చి నుండి ఆత్రేయపురం మెయిన్ రోడ్డు కాలువ రేవు వరకు శాంతి ర్యాలీ నిర్వహించి, ప్రవీణ్ పగడాలకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెల రోజుల క్రితం పాస్టర్ ప్రవీణ్ పగడాల సోషల్ మీడియాలో మాట్లాడుతూ మతోన్మాదులతో తనకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాల్సిందిగా కొరారని, అయినప్పటికీ ప్రభుత్వం ఆయనకు రక్షణ కల్పించలేదని విమర్శించారు. ఆయన చనిపోయిన రోజు నుండి పోస్టుమార్టం సమయం వరకు పూర్తి పరిణామాలు చూస్తుంటే అనుమానం కలగక మానదన్నారు. ఆయన మరణం ప్రమాదవశాత్తు జరిగినట్టు లేదని, మతోన్మాదులే ఆయనను హతమార్చి ఉండొచ్చని, పోలుసులు ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా సమగ్ర విచారణ జరిపి చనిపోయిన ప్రవీణ్ కుటుంబ సభ్యులకు, క్రైస్తవ సంఘాలకు భరోసా ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం సరైన న్యాయం చేయలేదని అనిపిస్తే యావత్ క్రైస్తవ సమాజం న్యాయం జరిగే వరకు ప్రభుత్వంపై న్యాయ పోరాటం చెయ్యడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో ఆత్రేయపురం మండల పాస్టర్ ఫెల్లోషిప్ సభ్యులు, సంఘస్తులు, యూత్ వారు అధికసంఖ్యలో పాల్గొన్నారు.






# నేటి నుండి అంగన్వాడి శిక్షణా తరగతులు.



**రావులపాలెం, మార్చి 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
అంగన్వాడీ కార్యకర్తలు తగు జాగ్రత్తలు పాటించి చిన్నారులపై శ్రద్ధ వహించాలని కొత్తపేట సిడిపిఓ ఎ గజలక్ష్మీ అన్నారు. శుక్రవారం మండల పరిధి ఈతకోట జడ్పీ ఉన్నత పాఠశాలలో సూపర్ వైజర్స్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో నిర్వహించిన అంగన్వాడి కార్యకర్తల పోషణ్ భీ-పఢాయ్ భీ శిక్షణా తరగతులకు ముఖ్య అతిథులుగా సిడిపిఓ ఎ గజలక్ష్మి, ఎంఈఓ లు బి శ్రీనివాస రాజు, నాగేంద్ర కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కెవిస్ వి కృష్ణారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ చిన్నారుల విద్య, ఆరోగ్యం విషయంలో అంగనవాడి కార్యకర్తలు తగు జాగ్రత్తలు పాటిస్తూ వారిపై శ్రద్ధ వహించారన్నారు. పోషణ్ భీ పఢాయ్ భీ అనేది ప్రభుత్వం మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన ఈసిసిఈ టాస్కోర్స్ సిఫార్సు లను అనుసరించి రూపొందించ బడిందన్నారు. 0-6 సం. పిల్లలకు సమగ్రమైన, నాణ్యమైన ప్రారంభ ప్రేరణ, పూర్వ ప్రాథమిక విద్యను ప్రోత్సహించడం, సంరక్షించడం, ఆటపాటల ద్వారా ఈ విద్యను అందించడం, ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించడం, తల్లిదండ్రులకు ఇవ్వడం, తదితర అంశాలపై ఆమె కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈశిక్షణా కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు నాగసత్యవేణి, ఫాతిమాబేగం, హిమశ్రీ, అరుంధతి, అధిక సంఖ్యలో మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## లీగల్ సర్వీసెస్ అధారిటీ వారిచే

# విద్యార్థులకు అవగాహన.




**కొత్తపేట, మార్చి 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సర్వీసెస్ అధారిటీ గుంటూరు, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అధారిటీ రాజమహేంద్రవరం వారి ఉత్తర్వులను అనుసరించి కొత్తపేట లీగల్ సెల్ వారి ఆధ్వర్యంలో స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కెపి రాజు అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. శుక్రవారం కళాశాలలో ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫర్ సెక్సువల్ అఫెన్సెస్ యాక్టు పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి కొత్తపేట లీగల్ సెల్ సీనియర్ న్యాయవాదులు అల్లు భాస్కరరావు (ప్యానల్ లాయర్), డి.బాల ప్రతాప్, కోర్టు సిబ్బంది నక్కా కృష్ణ, ఎం.సూర్య విచ్చేసి పోక్సో చట్టం గూర్చి విద్యార్థులకు వివరించారు. అలాగే వారు మాట్లాడుతూ మహిళల రక్షణకు ప్రభుత్వం ఎప్పటికప్పుడు అనేక చట్టాలు చేస్తుందని వాటిలో ఫోక్సో యాక్టు అత్యంత కీలకమైనదని తెలిపారు. ప్రస్తుతం సమాజంలో మహిళల పట్ల జరుగుతున్న అనేక సంఘటనలు ఎంతో బాధాకరమని అటువంటివి పునరావృతం కాకుండా మనమందరం కృషి చేయాలన్నారు. ముఖ్యంగా విద్యార్థి దశలో ఉన్న యువతకు స్వీయ రక్షణ ఎంతో అవసరమని వార తమ దృష్టిని చదువుపై కేంద్రీకరించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఉద్బోధించారు. తాత్కాలిక ఆకర్షణకు లోను కాకుండా సత్ప్రవర్తన కలిగి ఉండాలని తద్వారా తల్లిదండ్రులకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ప్రస్తుత టెక్నాలజీ వినియోగంలో యువత అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో ఉన్నప్పుడు సంప్రదించవలసిన టోల్ ఫ్రీ నెంబర్లను విద్యార్థులకు తెలియజేశారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే వీటిని వినియోగించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పి రాజు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. శ్రీనివాసులు, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కన్వీనర్ సిహెచ్ నాగరాణి, మహిళా అధ్యాపకులు ఏ. దీపిక దేవి, వి. నాగదీపిక, సిహెచ్ నాగ శ్రీలక్ష్మి , విద్యార్థులు పాల్గొన్నారు.

# పదవీ విరమణ అభినందన సభ




**అయినవిల్లి మార్చి 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
మండలంలోని శ్రీ నరహరిశెట్టి వెంకటరావు ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ దేవరపు శ్రీనివాస రావుకు శుక్రవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో అర్థశాస్త్ర అధ్యాపకుల బృందం అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డి ఐ ఈ ఓ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవీ విరమణ చేయబోతున్న దేవరపు శ్రీనివాసరావు మూల అన్నాజీరావులను ఆయన అభినందించారు. దేవరపు శ్రీనివాస్ ఎస్ ఎన్ వి ఆర్ కళాశాల అధ్యాపకునిగా ప్రిన్సిపాల్ బాధ్యతలను అంకితభావంతో నిర్వహించారన్నారు. విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారి ఉజ్వల భవిష్యత్తుకు కృషి చేశారన్నారు. అర్థశాస్త్ర అధ్యాపక బృందం వారిని దుస్సాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సాంబశివరావు వై లక్ష్మణరావు అడబాల శ్రీనివాసరావు కె శిరీష సామ్ ఆబెల్ వివి రమణ తదితరులు పాల్గొన్నారు.

# వాడపల్లి వెంకన్న హుండీ ఆదాయం రూ.1.23 కోట్లు

**ఆత్రేయపురం మార్చి 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



కోనసీమ తిరుమల ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానానికి హుండీ ఆదాయం భారీగా సమకూరింది. గురువారం హుండీ లెక్కింపు నిర్వహించగా 31 రోజులకు సుమారు రూ.1.23 కోట్ల ఆదాయం వచ్చింది. దేవస్థానం కార్యనిర్వహణాధికారి, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు పర్యవేక్షణలో హుండీలను తెరిచి లెక్కింపు ప్రారంభించారు. ఆలయ ప్రధాన హుండీల నుంచి రూ.96,99,132, అన్నప్రసాదం హుండీల నుంచి రూ.23,27,304, ఆలయ ప్రాంగణంలోని శ్రీ విశ్వేశ్వర స్వామి వారి ఆలయ హుండీల నుంచి రూ.2,99,236 వెరసి మొత్తం రూ.1,23,25,672 ఆదాయం వచ్చిందని డీసీ చక్రధరరావు తెలిపారు. అలాగే 10 గ్రాముల బంగారం, 1 కేజీ 925 గ్రాములు వెండి, 20 విదేశీ కరెన్సీ నోట్లు వచ్చాయని చెప్పారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ రాజమండ్రి తనిఖీదారు టి.వి.ఎస్.ఆర్. ప్రసాద్, గోపాలపురం గ్రూపు దేవాలయాల కార్యనిర్వహణాధికారి బి.కిరణ్, ఆత్రేయపురం గ్రూపు దేవాలయాల కార్యనిర్వహణాధికారి బి.నరేంద్ర కుమార్ పర్యవేక్షణలో లెక్కింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ముదునూరి వెంకటరాజు, దేవస్థానం మాజీ చైర్మన్ కరుటూరి నరసింహారావు, ఉప సర్పంచ్ పోచిరాజు బాబూరావు, అర్చకస్వాములు, శ్రీవారి సేవకులు, బ్యాంకు అధికారులు దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

## ఉగాది నుండి పి-4 విధానం ప్రారంభం : కలెక్టర్ ప్రశాంతి



**రాజమహేంద్రవరంమార్చి 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

సమాజంలో ఉన్నత స్థితిలో ఉన్న 10 శాతం మంది వారి ద్వారా అట్టడుగున ఉన్న 20 శాతం మంది పేదలను దత్తత తీసుకుని వారికి అండగా నిలిచి పేదరికం నుండి పైకి తీసుకురావాలనే ఒక మంచి ఆశయంతో పి-4 కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టడం జరిగిందని కలెక్టర్ పి ప్రశాంతి పేర్కొన్నారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఉదయం సమన్వయ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం సమీపంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర స్థాయిలో ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారని తెలియచేశారు. ప్రభుత్వ, ప్రవేట్, ప్రజల, భాగస్వామ్యంతో సమాజంలోని పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పీ4 విధానంపై ప్రభుత్వం ప్రజల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించడం జరుగుతోందన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఉగాది పర్వదినం నాడు జిల్లా నుంచి స్వయం సహాయక సంఘాలు, విద్యార్థులు, రైతులు, ఉపాధి కూలీలకు పి.4 పై వివరించి , ఆహ్వానించి ప్రత్యేక బస్సులు ద్వారా వారిని అమరావతి పి-4 ప్రారంభోత్సవ వేదిక వద్దకు తీసుకురావాల్సి ఉంటుందన్నారు. ఇందుకు అవసరమైన ఆర్టీసు బస్సులను, ఇద్దరు డ్రైవర్లను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. బస్సులు ద్వారా కార్యక్రమానికి తీసుకువచ్చే వారిని సురక్షితంగా వారి గమ్య స్థానాలకు తిరిగి చేర్చేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలన్నారు. నోడలు అధికారి ఆధ్వర్యంలో ప్రతి బస్సుకు ఒక లైజన్ అధికారిని, పోలీస్ సిబ్బందిని నియమించాలని కలెక్టర్ ప్రశాంతి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు, అదనపు ఎస్పీ ఏవి సుబ్బరాజు, ఆర్డీవోలు ఆర్ కృష్ణ నాయక్, రాణి సుస్మిత, జిల్లా ముఖ్య కార్యనిర్వణగా అధికారి ఎల్ అప్పలకొండ, డిఆర్డిఏ పిడి ఎన్వివిఎస్ మూర్తి, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ మాధవరావు, డిఐపిఆర్ఓ సిహెచ్ శ్రీనివాస్, డ్వామా పిడి ఎం నాగమల్లేశ్వరరావు, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంతోనే మహిళల ఆర్థికాభివృద్ధి


**ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**

**25 మంది మహిళలకు ఎలక్ట్రికల్ బైక్లు పంపిణీ**



**రాజమహేంద్రవరం, మార్చి 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** మహిళల ఆర్థికాభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. నగర పాలక సంస్థ ఆవరణలో స్వయం సహాయక సంఘ సభ్యులు 25 మంది మహిళలకు ఎలక్ట్రికల్ బైక్లను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, కమిషనర్ కేతన్ గర్గ్ మాట్లాడుతూ స్వయం సహాయక సభ్యుల కుటుంబ సభ్యుల జీవనోపాధి మెరుగు కోసం మెప్మా ద్వారా రాపిడో భాగస్వామ్యంతో వివిధ బ్యాంకుల ద్వారా రుణ సదుపాయంతో వీటిని పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా రాష్ట్రంలో విశాఖపట్నంలో 400, విజయవాడలో 400, నెల్లూరుకు 50, గుంటూరుకు 50, కర్నూలు, తిరుపతి, కాకినాడ, రాజమండ్రి పట్టణాలకు 25 చొప్పున మొత్తం 1000 మందికి ఈ ఎలక్ట్రికల్ బైక్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. మహిళ సాధికారత, వారి స్వయం ఉపాధి, జీవనోపాధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధ్యాత ఇస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం డ్వాక్రా సంఘాలను ప్రోత్సహిస్తోందని, ఇచ్చిన ఎన్నికల హామీలను నెరవేరుస్తోందన్నారు. దానిలో భాగంగానే మూడు ఉచిత గ్యాస్ సిలెండర్లు పథకంలో భాగంగా గత ఏడాది దీపావళి నుంచే ప్రారంభించి ఒక గ్యాస్ సిలెండర్ను కూడా అందించడం జరిగిందని గుర్తు చేశారు. ఈ ఏడాది మే నుంచే తల్లికి వందనం పథకం ప్రారంభమవుతుందన్నారు. మహిళల భద్రతకు ఇప్పటికే ప్రభుత్వం శక్తి యాప్ను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. మహిళ రైడర్లు ఎస్ఓఎస్, శక్తి యాప్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో 100 ఈ రిక్షాలు ఏర్పాటు చేసే యోచన ఉన్నందున మహిళలను భాగస్వామ్యం చేయాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రామాలయం ప్రథమ వార్షికోత్సవంలో పాల్గొన్న లీలాకృష్ణ




**మండపేట, మార్చి 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

మండలంలోని ఏడిద సావరం గ్రామంలో కొలువై ఉన్నటువంటి శ్రీ రామాలయం ప్రథమ వార్షికోత్సవంలో ముఖ్య అధితిగా మండపేట నియోజకవర్గ జనసేనపార్టీ ఇంచార్జ్ వేగుళ్ళ లీలాకృష్ణ పాల్గొన్నారు. ముందుగా ఆలయంలో శ్రీ సీతారాముల స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి దివ్య ఆశీస్సులు ప్రజాలందరిపై ఉండాలని ఆయన కోరారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు పూలమాలలు వేసి, శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

## వాటర్ పార్క్ ప్రారంభోత్సవ చేసిన మంత్రి కందుల దుర్గేష్



**బాపట్ల, మార్చి 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

బాపట్ల మండలం అడవి పల్లెపాలెం గ్రామంలో వి వాటర్ పార్క్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ మరియు సాంస్కృతిక శాఖ మంత్రివర్యులు కందుల దుర్గేష్ తో కలిసి బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు గారు పాల్గొని ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో బావుడా చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు, బాపట్ల పట్టణ అధ్యక్షులు గొలపల శ్రీనివాస్ రావు గారు, జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ,మార్కెట్ యార్డ్ చైర్మన్ కావూరి నివాసరెడ్డి, మరియు తెలుగుదేశం జనసేన బిజెపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రసాంతంగా రాజమండ్రి బార్ అసోసియేషన్ ఎన్నికలు

**రాజమహేంద్రవరం, మార్చి 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



ప్రతిసాత్మకమైన ది రాజమండ్రి బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు శుక్రవారం హెూరాహెూరీగా జరుగుతున్నాయి. ఎన్నికల అధికారి కె. మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో 2025- 2026 కాల పరిమితికి సంబంధించి నూతన కార్యవర్గ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల్లో సీనియర్లు, జూనియర్లు, మహిళా న్యాయవాదులు ఉత్సాహంగా ఓటింగ్ లో పాల్గొంటున్నారు ఓటింగ్లో పాల్గొంటున్నారు. అధ్యక్ష పదవి కి సీనియర్ న్యాయవాదులు పి వి ఎస్ కే శోభనాద్రి శాస్త్రి , పి,వీరేంద్రనాథ్ పోటీ పడుతున్నారు. ఉపాధ్యక్షులుగా అల్లంపల్లి రామకృష్ణ, పీ వీవి నాగరాజు, ప్రధాన కార్యదర్శులుగా వెంట్రపాటి ఉమామహేశ్వరి, పెళ్లూరి రమేష్, వై. భవాని ప్రసాదు లు పోటీ పడుతున్నారు. సంయుక్త కార్యదర్శులుగా ధర్నాలకోట వెంకటేశ్వరరావు, సి పి రెడ్డి ,మలకా శ్రీనివాసులు పోటీ పడుతున్నారు. కోశాధికారి పదవికి కర్ర హనుమంతరావు, నర్సింగ శ్రీనివాసరావు లు పోటీ చేస్తున్నారు. అబొవ్ 30 ఇయర్స్ ప్రతినిధులుగా పి. ఎల్. ఎన్ ప్రసాదు, డి వివి త్రినాథ్ లు, అబొవ్ 20 ఇయర్స్ ప్రతినిధులుగా కేఎల్ఆర్ మనీష్, సుమన్ పాల్ లు పోటీ పడుతున్నారు. లైబ్రరీ సెక్రెటరీ లు గా బి.సుధాకర్ ,భువనేశ్వర్ లు , స్పోర్ట్స్, కల్చరల్ సెక్రటరీ పదవి కు కాశీ శ్రీనివాసరావు, రాజ శేఖర్ లు, మహిళా ప్రతినిధులుగా జి .రాజేశ్వరి, వరలక్ష్మిని పోటీ పడుతున్నారు. అసోసియేషన్ లో సుమారు 1500 మంది న్యాయవాదులు సభ్యులుగా ఉన్నారు.

## నెట్వర్క్ ఆసుపత్రుల సమస్యలు పరిష్కరించాలి : కలెక్టర్లకు ఎన్టీఆర్ వైద్య సేవ నెట్వర్క్ ఆసుపత్రులు వినతి

**రాజమహేంద్రవరం,మార్చి 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



ఎన్టీఆర్ వైద్య సేవ నెట్వర్క్ ఆసుపత్రులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పటల్ అసోసియేషన్ (ఆషా) ఆధర్యంలో జరుగుతున్న పోరాటంలో భాగంగా శుక్రవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోను అసోసియేషన్ ప్రతినిధులు జిల్లా కలెక్టర్లను కలిసి వినతిపత్రాలను సమర్పించారు. నెట్వర్క్ ఆసుపత్రులు ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద చేపట్టిన వైద్య సేవలకు గాను రాష్ట్రప్రభుత్వం నెట్వర్క్ ఆసుపత్రులకు సుమారు రూ.3వేల 500 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. బకాయిలు భారీగా పేరుకుపోవటంతో నెట్వర్క్ ఆసుపత్రుల నిర్వహణ తలకుమించిన భారంగా తయారయింది. తమ ఆవేదనను గౌరవ ముఖ్యమంత్రితో పాటు మంత్రుల. ఉన్నతాధికారుల దృష్టికి చాలా సార్లు తీసుకెళినప్పటికీ ఫలితం లేకపోవటంతో, గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దశల వారీ వివిధ రూపాల్లో తమ ఆందోళనను వ్యక్తంచేస్తున్నారు. అయినప్పటికీ ఫలితం లేకపోవడం తమ ఆందోళనకు ఉద్యమ రూపాన్ని ఇచ్చారు. ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఏప్రిల్ 7 నుండి ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద వైద్య సేవలను పూర్తిగా నిలిపివేయాలని నిర్ణయించారు. దీనికి ముందస్తుగా అన్ని జిల్లాల్లోని కలెక్టర్లు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారులు, ఎన్టీఆర్ నెట్వర్క్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించి, శుక్రవారం వినతిపత్రాలు సమర్పించారు. 30న జిల్లాల్లోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు వినతిపత్రాలు సమర్పించాలని నిర్ణయించారు. ఆషా పిలుపు మేరకు తూర్పుగోదావరి జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కురుకూరి విజయకుమార్, జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఆరుణ్ నాయకత్వంలో పలువురు అసోసియేషన్ ప్రతినిధులు జిల్లా కలెక్టర్రు కలిసి వినతిపత్రం అందజేశారు.

## మన సంస్కృతి సంపద మన పండుగలే . జిల్లా కలెక్టర్ నాగరాణి



**భీమవరం, మార్చి 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

కొత్త సంవత్సరం ఆరంభమవుతోందని, ఈ ఏడాది అందరి జీవితాల్లో కొత్త ఆశ, సంతోషం నింపాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ నాగరాణి ఉగాది వేడుకల బ్రోచర్ ను ఆవిష్కరించారు. నాగరాణి మాట్లాడుతూ మన సంస్కృతి సంపద మన పండుగ లని, మన సాంప్రదాయాలు యుగాంతం వరకు చెరగని ముద్రలని, భీమవరం 36 ఏళ్లుగా ఉగాది వేడుకలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. నిర్వాహకులు కాంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఈనెల 30న భీమేశ్వర స్వామి దేవస్థానంలో ఉగాది వేడుకలను నిర్వహిస్తున్నామని, 50 మంది విశిష్ట సేవాతత్పరులకు ఉగాది పురస్కారాలను అందిస్తున్నామని తెలిపారు.

## పోలవరం ప్రాజెక్టును మొదటిసారి రాజశేఖరరెడ్డి , రెండోసారి జగన్ విధ్వంసానికి గురి చేశారు.

**రూ 829 కోట్లు నేరుగా నిర్వాసితుల అకౌంట్లో జమ చేసిన ఘనత ఎన్డీఏ ప్రభుత్వానిది.**

**గత ప్రభుత్వంలో తీవ్ర ఇబ్బందులు పడ్డామని, సాయం అందించ లేకపోయారని గగ్గోలు పెట్టిన నిర్వాసితులు.**

**రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టరు నిమ్మల రామానాయుడు ...**




**పాలకొల్లు, మార్చి 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

పోలవరం ప్రాజెక్టును ఆనాడు మధుకాన్ కాంట్రాక్టర్లు రద్దుచేసి రాజశేఖర్ రెడ్డి మొదటి విధ్వంసంచేశారని, 2019 లో రివర్సు టెండరింగు పేరు చెప్పి 17 నెలలు ఏజెన్సీ లేకుండా రెండవ విధ్వంసం జగన్ చేశాడని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టరు నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గో పోలవరం ప్రాజెక్టు గురించి జగన్ విధ్వంస ముఠా పదేపదే చెబుతున్న అబద్ధాలు, అసత్యాల తీవ్ర స్థాయిలో మంత్రి రామానాయుడు కౌంటరు ఇచ్చారు.చంద్రబాబు ప్రభుత్వం 2014-19 నందు పోలవరం ప్రాజెక్టును పట్టాలెక్కించి 72 శాతం పనులు పూర్తి చేసిందన్నారు 2019 లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చినట్లయితే 2020 నాటికి పోలవరం పూర్తిచేసి కరువురహిత ఆంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దే వాళ్ళమని అన్నారు. గత ప్రభుత్వంలో తీవ్ర ఇబ్బందులు పడ్డామని, సాయం అందించలేక పోయారని నిర్వాసితులు గగ్గోలు పెట్టారని,రూ 829 కోట్లు నేరుగా నిర్వాసితుల అకౌంట్లో జమ చేసిన ఘనత ఎన్డీఏ ప్రభుత్వానిది అన్నారు. 2020 జగన్ విధ్వంసంతో రూ 440 కోట్ల డయాఫ్రమ్ వాల్ ధ్వంసం అయింది అన్నారు. జగన్ విధ్వంస ముఠా, చంద్రబాబు, పోలవరం గురించి మాట్లాడుతుంటే రావణాసురుడు రాముడు గురించి,రాక్షసులు యజ్ఞాలు యాగాలు గురించి మాట్లాడుతున్నట్టు ఉందని అన్నారు.భాక్రానంగల్, నాగార్జునసాగర్, శ్రీశైలం ఇలా అన్ని ప్రాజెక్టులకు డయాఫ్రమ్ వాల్ ఉంటుందని అంటే ఏ ప్రాజెక్టుకు డయాఫ్రమ్ వాల్ ఉంటుందో తెలియని వ్యక్తి పోలవరం గురించి మాట్లాడమా అని అన్నారు. పోలవరం నాకు అర్థం కాలేదు, అందుచేత ఎవరికీ అర్థం కాదు పోలవరం ఎప్పటికి పూర్తవుతుందో చెప్పలేము అన్న ఇరిగేషన్ శాఖ మాజీ మంత్రికి పోలవరం గురించి మాట్లాడే నైతిక అర్హత లేదని అన్నారు.తెలియక పోవడం తప్పు కాదని,తెలుసుకుని మాట్లాడ లేకపోవడం బాధ్యతారాహిత్యమని మంత్రి అన్నారు.2020 ఆగస్టు వరదలకు డయాఫ్రమ్ వాల్ పోతే, 2021 జూన్, డిసెంబరు 2022 జూన్ అంటూ అంటే డయాఫ్రమ్ వాల్ ఉందో లేదో తెలియకుండా గత ముఖ్యమంత్రి అసెంబ్లీలో మాట్లాడారని అన్నారు. పోలవరం చరిత్రలో ఫేజ్-1, ఫేజ్-2 అంటూ 41.15 మరియు 45.72 మీటర్లకు తీసుకువచ్చింది జగన్ అని అన్నారు.పోలవరం కుడి, ఎడమ కాలువల నీటి సామర్థ్యం 17,500 క్యూసెక్కుల నుండి 9 వేలుకు, 6 వేలుకు తగ్గించి ఉత్తరాంధ్రకు,రాయలసీమకు ద్రోహం చేసిన వ్యక్తి జగన్ అని అన్నారు.గత ప్రభుత్వం వల్ల పోలవరానికి రూ 50 వేల కోట్లు నష్టం వాటిల్లిందని తెలిపారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు పోలవరాన్ని పట్టాలెక్కించారని తెలిపారు.కేంద్రంలో ప్రధాని, ఆర్థిక మంత్రి,కేంద్ర జలవనరుల శాఖ మంత్రి చంద్రబాబు కలిసి తొమ్మిది నెలల కాలంలోనే రూ 12 వేల 157 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేయించారని, ఇప్పుడు అడ్వాన్స్గా 5052 కోట్ల రూపాయల నిధులు పోలవరం కోసం మంజూరు చేయించారని తెలిపారు.గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకం వల్ల రూ 440 కోట్లు రూపాయలు డయా ఫ్రమ్ వాల్ కు నష్టం వాటిల్లిందని,వందల కోట్ల రూపాయలు గైడ్ బండకు కూడా నష్టపరిచిందని తెలిపారు.రూ 829 కోట్లు నిర్వాసితులు ఖాతాలో చంద్రబాబు జమ చేశారని అన్నారు.రూ 990 కోట్లతో డయాఫ్రమ్ వాల్ నిర్మాణ పనులు జరుగుతున్నాయని, ఎగువ కాపర్ డ్యామ్ బలోపేతానికి బట్రస్ డ్యామ్ పనులు జరుగుతున్నాయని అన్నారు.పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేసేందుకు దశలవారీగా లక్ష్యాలను నిర్దేశించామని తెలిపారు.డయాఫ్రమ్ నిర్మాణాన్ని 2025 డిసెంబరు నాటికి పూర్తిచేయాలని,రైట్ మెయిన్ కెనాల్ కనెక్టవిటీ లను జులై 2026 నాటికి పూర్తిచేయాలని సూచించామని తెలిపారు. ఈ సి ఆర్ ఎఫ్ -గ్యాప్ 1 పనులను 2026 మార్చి లోగా పూర్తి చేయాలని, ఈ సి ఆర్ ఎఫ్ -గ్యాప్ 2 పనులను 2027 డిసెంబరు నాటికి లక్ష్యం నిర్దేశించినప్పటికీ గోదావరి పుష్కరాల కంటే ముందుగానే 2027 ఏప్రిల్ నాటికి పూర్తిచేసి, జాతికి అంకితం చేసేలా అధికారులు, కాంట్రాక్టర్లు పనిచేసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు తగు ఆదేశాలు జారీచేశారని అన్నారు. పోలవరం నిర్మాణం పనులు వేగవంతంగా జరుగు తున్నాయని ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబాబు మూడు సార్లు పర్యటించారని అన్నారు.జగన్ విధ్వంస ముఠా సైంధవుల్లా పోలవరం పురోగతికి అడ్డుపడుతూ అబద్ధాలు ప్రచారం చేస్తేనే ప్రజలు బుద్ధి చెప్పారని, భవిష్యత్తులో కూడా ఇదే రీతిలో బుద్ధి చెబుతారని అన్నారు.ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులను నూటికినూరుశాతం ఆదుకుంటామని మంత్రి రామానాయుడు మరోసారి స్పష్టం చేశారు.

.......................................................

# మయన్మార్, బ్యాంకాక్‌లలో భారీ భూకంపం

## అత్యవసర స్థితి ప్రకటన

**బ్యాంకాక్: మయన్మార్‌ను శుక్రవారం వరుస భూకంపాలు వణికించాయి. 12 నిమిషాల వ్యవధిలో రెండు సార్లు భారీ భూకంపాలు సంభవించాయి. రిక్టర్ స్కేలుపై వీటి తీవ్రత 7.7గా నమోదైంది. ఈ భూకంపం కారణంగా పొరుగున ఉన్న థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో రెండుసార్లు తీవ్ర ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. ప్రకంపనల కారణంగా పలు భవనాలు ధ్వంసమైనట్లు తెలుస్తోంది. ప్రజలు భయాందోళనకు గురై ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. బ్యాంకాక్‌లో ప్రకంపనల తీవ్రత 6.4, 7.3గా నమోదైంది. అటు భారత్ సహా ఆగ్నేయాసియా దేశాల్లోనూ ఈ ప్రభావం కన్పించింది.**



### మయన్మార్‌లో 20మంది మృతి!

భూకంపం ధాటికి మయన్మార్‌లో ఇప్పటివరకు 20మంది మృతిచెందినట్లు స్థానిక మీడియా పేర్కొంది. అనేకమంది గాయపడినట్లు పేర్కొంది. ఈ ఘటనలో మృతుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. మరోవైపు, బ్యాంకాక్‌లో ఓ భవనం కూలిపోవడంతో ఇద్దరు మృతిచెందగా.. ఏడుగురిని కాపాడినట్లు ఎమర్జెన్సీ రెస్పాండర్ మీడియాకు తెలిపారు.

సెంట్రల్ మయన్మార్‌లోని మోనివా నగరానికి తూర్పున 50 కిలోమీటర్ల దూరంలో 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు యూఎస్ జియోలాజికల్ సర్వే గుర్తించింది. స్థానిక కాలమానం ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం 1.30 గంటలకు బ్యాంకాక్‌లో ప్రకంపనలు సంభవించాయి. పలు భవనాల్లో అలారమ్ మోగడంతో ప్రజలు బయటకు పరుగులు తీశారు.

### శిథిలాల కింద 43 మంది..?

ప్రకంపనల ధాటికి అనేక భవనాలు ఊగిపోయాయి. పలు భవంతులు నేలమట్టమయ్యాయి. ఓ భారీ భవంతి పైఅంతస్తులో ఉన్న స్విమ్మింగ్ పూల్‌లోని నీరు కిందకు పడిపోయిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల భవనం పేకమేడలా కూలిన దృశ్యాలు బయటికొచ్చాయి. ప్రమాదం సమయంలో ఆ భవనంలో ఎవరైనా కార్మికులు ఉన్నారా? శిథిలాల కింద చిక్కుకుపోయారా? అన్న వివరాలు ఇంకా తెలియరాలేదు. అయితే, 43 మంది కార్మికులు చిక్కుకున్నట్లు పలు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. తాజా పరిస్థితుల నేపథ్యంలో థాయ్‌లాండ్‌లో ప్రధాని షినవత్ర అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. మరోవైపు, మయన్మార్‌లోనూ అనేక భవనాలు ధ్వంసమైనట్లు తెలిసింది. పలు రహదారులపై చీలికలు ఏర్పడ్డాయి. అయితే.. భూకంపం కారణంగా ఆస్తి, ప్రాణనష్టం వివరాలు ఇంకా తెలియరాలేదు.

### భారత్‌లోనూ ప్రకంపనలు..

ఈ భూకంప ప్రభావం ఆగ్నేయాసియా దేశాలపైనా కన్పించింది. భారత్‌లోని కోల్‌కతా, ఇంఫాల్, మేఘాలయలో స్వల్పంగా ప్రకంపనలు సంభవించాయి. దీంతో ప్రజలు భయాందోళనతో బయటకు పరుగులు తీశారు. మేఘాలయ ఈస్ట్‌గారో హిల్స్‌లో 4 తీవ్రతతో ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. బంగ్లాదేశ్‌లోనూ 7.3 తీవ్రతతో భూమి కంపించినట్లు తెలుస్తోంది.

# జగ్జీత్‌సింగ్ దల్లేవాల్ నిజమైన రైతు నాయకుడు: సుప్రీం

**దిల్లీ: రైతుల డిమాండ్ల సాధన కోసం రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దల్లేవాల్ నిరవధిక నిరసన కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. పంజాబ్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అంగీకరిస్తూ.. శుక్రవారం ఆయన నీటిని స్వీకరించి తన దీక్షను విరమించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలియజేసింది. ఖనౌరి, శంభు సరిహద్దుల్లో నిరసన తెలుపుతున్న వారిని చెదరగొట్టి రహదారులను తెరిచినట్లు పేర్కొంది. రైతుల డిమాండ్ల సాధన కోసం తన ప్రాణాలను పణంగా పెట్టిన దల్లేవాల్‌ను అత్యున్నత న్యాయస్థానం ప్రశంసించింది.**



రైతులకు మంచి చేయాలనే ఆలోచన తప్ప.. ఆయనకు ఎలాంటి రాజకీయ అజెండా లేదని పేర్కొంది. అతడు నిజమైన కర్షక నాయకుడని కీర్తించింది. క్షేత్రస్థాయిలో ప్రస్తుత పరిస్థితికి సంబంధించిన నివేదికను సమర్పించాలని పంజాబ్, హరియాణా ప్రభుత్వాలను ఆదేశించింది. రైతుల ఫిర్యాదులను పరిశీలించి, అక్కడి స్థితిని తెలియజేసే నివేదికలను దాఖలు చేయాలని మాజీ హైకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలోని ఉన్నతాధికార కమిటీని కోరింది. దల్లేవాల్‌కు వైద్యసహాయం అందించాలన్న సుప్రీంకోర్టు ఆదేశాన్ని పాటించనందుకు పంజాబ్ ప్రధాన కార్యదర్శి, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌పై విధించిన కోర్టు ధిక్కార చర్యలను కూడా ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది. పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడం వంటి డిమాండ్లతో నవంబరు 26 నుంచి జగ్జీత్‌సింగ్ దల్లేవాల్ పంజాబ్-హరియాణా సరిహద్దులోని ఖనౌరీ శిబిరం వద్ద నిరవధిక నిరసన దీక్ష చేపట్టారు. దీంతో రోజురోజుకీ ఆయన ఆరోగ్యం క్షీణిస్తుండటంతో వైద్యసహాయం అందించాలని సుప్రీం అక్కడి ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. అయితే దల్లేవాల్‌కు వైద్యం అందించడానికి వెళ్తే రైతు సంఘాలు అడ్డుకుంటున్నాయని, కనీసం ఐవీ ఫ్లూయిడ్స్‌నైనా ఇచ్చేందుకు వీలుచిక్కడం లేదని పంజాబ్ ప్రభుత్వం పలుమార్లు నిస్సహాయత వ్యక్తం చేసింది. రైతు ప్రతినిధులతో చర్చలకు కేంద్రం అంగీకరిస్తే వైద్యసాయం పొందడం తనకు సమ్మతమేనని రైతు నాయకుడు జగ్జీత్‌సింగ్ దల్లేవాల్ ఇటీవల ప్రకటించారు.

# విదేశీ సంస్థల కోసం చైనా ద్వారాలు మరింత తెరుచుకుంటాయి..: జిన్‌పింగ్

**చైనా : ఓ పక్క అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ట్రేడ్ వార్ ప్రారంభిస్తే.. మరో వైపు చైనా అధినేత జిన్‌పింగ్ మాత్రం విదేశీ సంస్థలకు ఆహ్వానం పలుకుతున్నారు. బీజింగ్‌లోని గ్రేట్ హాల్ ఆఫ్ ది పీపుల్స్‌లో ప్రపంచ స్థాయి వ్యాపార దిగ్గజాలతో ఆయన నేడు భేటీ అయ్యారు. ఈ కార్యక్రమంలో 40 మంది సీఈవోలు పాల్గొన్నారు. వీరిలో శాంసంగ్ చీఫ్ లీ జే యంగ్, హెడ్జ్ ఫండ్ బాస్ రే డాలియో, బ్లాక్‌స్టోన్ గ్రూప్ సీఈవో, టొయోటా, ఆస్ట్రాజెనికా, ఫెడ్‌ఎక్స్, సౌదీ అరామ్‌కో సంస్థల ఎగ్జిక్యూటివ్‌లు ఉన్నారు.**



ఈ సందర్భంగా జిన్‌పింగ్ మాట్లాడుతూ 'ఏకపక్ష వైఖరి, రక్షణాత్మక వైఖరి' పెరుగుతోందని వ్యాపారవేత్తలను హెచ్చరించారు. ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్ల నేపథ్యంలో బహుళ పక్ష వైఖరి మాత్రమే సరైన ఎంపిక అని పేర్కొన్నారు. ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన పన్నులను ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్లు భావిస్తున్నారు.

ఈ భేటీ సందర్భంగా ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలు పాటించడంతోపాటు.. వ్యాపారాలు, పెట్టుబడుల్లో సరళీకరణను కొనసాగిస్తామని జిన్‌పింగ్ హామీ ఇచ్చారు. అంతేకాదు.. విదేశీ సంస్థలు చైనాలో ప్రయోజాలను, సామర్థ్యాలను మెరుగుపర్చుకుని.. ప్రపంచ వాణిజ్య పోటీలో లబ్ధి పొందాలని సూచించారు. విదేశీ సంస్థలే మూడో వంతు చైనా ఎగుమతులు, దిగుమతులకు కారణమని వెల్లడించారు. నాలుగో వంతు విలువ జోడింపు, ఏడింట ఒకటో వంతు పన్ను, 3 కోట్ల ఉద్యోగాలను ఈ సంస్థలు కల్పిస్తున్నట్లు ఆయన చెప్పారు. విదేశీ సంస్థలకు చైనా ద్వారాలు మరింత తెరుచుకుంటాయని జిన్‌పింగ్ చెప్పారు. అమెరికా-చైనా వాణిజ్య ఉద్రిక్తతలను చర్చల ద్వారా పరిష్కరించుకుంటామని వెల్లడించారు. విదేశీ పెట్టుబడులకు చైనా సురక్షితమైన, సుస్థిరమైన ప్రదేశమన్నారు. అంతేకాదు.. 'నేడు చైనాలో పెట్టుబడి పెట్టడమంటే.. రేపటికి మదుపు చేయడమే' అని అభివర్ణించారు.

## థాయ్‌లాండ్, శ్రీలంకల్లో పర్యటించనున్న ప్రధాని మోదీ



**థాయ్‌లాండ్ : ప్రధాని నరేంద్ర మోదీ థాయ్‌లాండ్, శ్రీలంకల పర్యటన షెడ్యూల్ ఖరారైంది. ఏప్రిల్ మొదటి వారంలో మోదీ ఆయా దేశాలకు వెళ్లనున్నట్లు విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఓ ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది.**

థాయ్‌లాండ్ ప్రధాని పేటోంగ్టార్న్ ఆహ్వానం మేరకు మోదీ ఆ దేశంలో పర్యటించనున్నారు. ఏప్రిల్ 3-4 తేదీల్లో థాయ్‌లాండ్‌లో జరగనున్న 'బే ఆఫ్ బెంగాల్ ఇనీషియేటివ్ ఫర్ మల్టీ సెక్టోరల్ టెక్నికల్ అండ్ ఎకనామిక్ కోఆపరేషన్' (బిమ్‌స్టెక్) కూటమి సమావేశంలో పాల్గొంటారు. అందులో ప్రాంతీయ సహకారం, భాగస్వామ్య బలోపేతంతో పాటు భద్రత, వాణిజ్యం, పెట్టుబడులు, ఆహారం, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలపై దేశాధినేతలు చర్చిస్తారు. ఈ పర్యటనలో భాగంగా పేటోంగ్టార్న్‌తో మోదీ భేటీ అవుతారు. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సహకారం పెంపు, వాణిజ్యం వంటి పలు అంశాలపై ఇరువురు నేతలు చర్చించనున్నారు.

అనంతరం ఏప్రిల్ 4న మోదీ శ్రీలంక వెళతారు. ఆ దేశాధ్యక్షుడు అనురకుమార దిసనాయకే గతేడాది భారత్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా కుదిరిన పలు ఒప్పందాలపై ఇరువురు నేతలు చర్చించనున్నారు. అక్కడి పలువురు రాజకీయ నేతలతో కూడా మోదీ సమావేశమవుతారు. ఈ పర్యటనలో భాగంగా సంపూర్ సోలార్ పవర్‌స్టేషన్‌తో సహా పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని ప్రారంభిస్తారు.

## పాక్‌లో విస్తృతంగా మైనారిటీలపై దాడులు: జైశంకర్



**పాక్ : కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్ పాకిస్థాన్‌పై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పాక్‌లో మైనారిటీలపై విస్తృతంగా దాడులు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. భారత్ వాటిని నిశితంగా పరిశీలిస్తోందని.. ఆ దాడులను అంతర్జాతీయ సమాజం దృష్టికి తీసుకెళ్తామని వెల్లడించారు. పార్లమెంటు సమావేశాల్లో భాగంగా ప్రసంగిస్తూ జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు.**

పాకిస్థాన్‌లో హిందువులు సహా ఇతర మైనారిటీలపై జరిగిన తాజా దురాగతాల గురించి పేర్కొంటూ.. 2025 ఫిబ్రవరిలో హిందువులపై 10, సిక్కులపై 3 కేసులు నమోదయ్యాయని అన్నారు. ఇతర మైనారిటీల పైనా కేసులు ఉన్నట్లు తెలియజేశారు. అక్కడి హిందువులను బలవంతంగా మతం మార్పించడానికి కూడా ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఈ కేసులను అంతర్జాతీయ స్థాయిలో పరిశీలిస్తామన్నారు. పాకిస్థాన్ ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తున్న అంశాన్ని ఐక్యరాజ్య సమితిలోని భారత ప్రతినిధులు లేవనెత్తారని అన్నారు. ఈ చర్యలతో ఆ దేశం ప్రజాస్వామ్య, మానవ హక్కుల విలువలను ఉల్లంఘిస్తోందని వారు పేర్కొన్నారని తెలిపారు.

## త్రిభాషా సూత్రాన్ని వ్యతిరేకిస్తూ విజయ్ పార్టీ తీర్మానం



**తిరువన్మయూర్ : జాతీయ విద్యావిధానంలోని త్రిభాషా సూత్రం, నియోజకవర్గాల పునర్విభజన అంశాలపై కేంద్రం, కొన్ని రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వివాదం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈక్రమంలోనే వీటిని వ్యతిరేకిస్తూ.. తమిళగ వెట్రి కళగం పార్టీ తీర్మానాలను ఆమోదించింది. శుక్రవారం తిరువన్మయూర్‌లో తొలి జనరల్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఆ సమావేశంలో వక్ఫ్ సవరణ బిల్లుతో సహా మొత్తం 17 తీర్మానాలను ఆ పార్టీ ఆమోదించింది. ఈ సమావేశంలో పార్టీ అధ్యక్షుడు విజయ్ పాల్గొన్నారు.**

సమావేశంలో వక్ఫ్ బిల్లును ఉపసంహరించుకోవాలని కేంద్రాన్ని కోరాలని పార్టీ నిర్ణయించింది. తాము ద్విభాషా విధానానికి కట్టుబడి ఉన్నట్లు తెలిపింది. విద్యావిధానంలో మూడు భాషల విధానం అమలు ప్రతిపాదన ఫెడరలిజానికి విరుద్ధమని, దీన్ని ఎప్పటికీ తాము అంగీకరించమని స్పష్టం చేసింది. డీలిమిటేషన్ కారణంగా దక్షిణాది రాష్ట్రాల సీట్లు తగ్గుతాయని తీర్మానంలో పేర్కొంది. ఈసందర్భంగా రాష్ట్రంలో డ్రగ్స్ వాడకం పెరిగిపోయిందని, దీన్ని నియంత్రించడంలో అధికార డీఎంకే ప్రభుత్వం విఫలమైందని ఆరోపించింది. ఉద్యోగులకు పాత పెన్షన్ పథకంపై ఆ పార్టీ తప్పుడు వాగ్దానాలు చేస్తోందని పేర్కొంది. శ్రీలంకలో అరెస్టైన భారతీయ మత్స్యకారుల సమస్యను తమిళగ వెట్రి కళగం పార్టీ (టీవీకే) లేవనెత్తింది. మత్స్యకారులకు అండగా ఉంటామని, దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను డిమాండ్ చేసింది.

# ఫస్ట్ ధోనీకి.. తర్వాతే సీఎస్కేకు సపోర్ట్.. ఇది వారికి ఇబ్బందికరమే: రాయుడు



**చెన్నై సూపర్ కింగ్స్ క్రేజ్‌కు కారణం ఎంఎస్ ధోనీ. సుదీర్ఘంగా ఆ జట్టుతో ప్రయాణిస్తోన్న అతడి కోసమే మైదానాలకు వచ్చేవాళ్లు ఉన్నారంటే అతిశయోక్తి కాదు. ఇప్పటికీ ధోనీ బ్యాటింగ్ చూసేందుకు ప్రేక్షకులు పోటీపడతారు. అయితే, ధోనీ క్రేజ్ ముందు సీఎస్కేలోకి కొత్తగా వచ్చే క్రికెటర్లు ఇబ్బందిపడతారని.. వారిపై ఒత్తిడి కూడా ఎక్కువగా ఉంటుందని మాజీ క్రికెటర్ అంబటి రాయుడు వ్యాఖ్యానించాడు. అసలు సీఎస్కేకు మద్దతు ఇస్తున్నారంటే తొలుత ధోనీకి ఫ్యాన్స్ అయి ఉంటారని వెల్లడించాడు.**


'ఆర్సీబీ' నాటి సంబరాలకు 'సీఎస్కే' నేడు బదులు తీర్చుకొనేనా?

"సీఎస్కేలో కొత్తవాళ్లకు ఆరంభంలో కాస్త కష్టంగా అనిపిస్తుంది. ధోనీ కోసం అభిమానులు భారీగా వస్తారు. ఆ మద్దతు అద్భుతం. బ్యాటింగ్‌కు వెళ్లినప్పుడు త్వరగా ఔటై పోవాలని వారు కోరుకుంటారు. అలాగని జట్టు ఓడిపోవాలని కాదు. ధోనీ త్వరగా బ్యాటింగ్‌కు రావాలనేదే వారి ఆకాంక్ష. అందుకే, అతడిని తలా (నాయకుడు) అని పిలుస్తారు. సీఎస్కేపై ధోనీ ప్రభావం చాలా ఎక్కువ. ఆ జట్టు కోసం అతడు చేసిన దానికే పెద్దఎత్తున ఫ్యాన్స్ అయిపోయారు" అని రాయుడు తెలిపాడు.

### చాలామంది బయటకు చెప్పలేరు..

"ఐపీఎల్ ఆరంభం నుంచి ధోనీ క్రేజ్‌తోనే సీఎస్కే ముందుకుసాగుతోంది. చాలామంది క్రికెటర్లు తమ మనసులో అనుకొన్న విషయాలను బయటకు చెప్పలేరు. అలాంటివాటిల్లో ధోనీ క్రేజ్ కూడా ఉంటుంది. ధోనీని క్రీజ్‌లో చూడాలనుకొనే క్రమంలో సొంత జట్టు బ్యాటర్లనే ఔట్ కావాలని కోరుకుంటారు. ఇది కాస్త కొత్తగానే అనిపిస్తుంది. జట్టులోని ఇతర ప్లేయర్లు తమ సత్తా చాటేందుకు వేదికగా నిలుస్తుందనడంలో సందేహం లేదు. అదే సమయంలో ఒత్తిడి కూడా ఎక్కువగానే ఉంటుంది. దీనిని తప్పించుకోవడం చాలా కష్టం. ధోనీ రిటైర్‌మెంట్ అంశం ఎప్పుడూ క్లిష్టమైందే. అభిమానులను ఈ స్థాయిలో మైదానాలకు రప్పించే స్థాయి కలిగిన క్రికెటర్‌ను మరొకరిని తయారుచేసుకోవాల్సిన అవసరం సీఎస్కేకు ఉంది. ధోనీ ఉండటం వల్ల ప్రతి రోజూ స్టాండ్స్ నిండిపోతున్నాయి. ఈ స్థాయి క్రికెటర్ మరొకరు లేరని భావిస్తున్నా" అని రాయుడు తెలిపాడు.

# 'ఈడెన్ గార్డెన్స్' పిచ్ వివాదం.. క్యూరేటర్ యూటర్న్!



**ఐపీఎల్ 2025 సీజన్ తొలి మ్యాచ్ ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగింది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన కోల్‌కతా నైట్ రైడర్స్‌కు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు షాక్ ఇచ్చింది. అయితే, ఇక్కడే 'పిచ్' వివాదం మొదలైంది. తాను అడిగినట్లు పిచ్‌ను తయారుచేయలేదని క్యూరేటర్‌ను ఉద్దేశించి కేకేఆర్ సారథి అజింక్య రహానె చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. దానిపై స్పందిస్తూ పిచ్ క్యూరేటర్ సుజన్ ముఖర్జీ "ఐపీఎల్ నిబంధనల ప్రకారం ఫ్రాంచైజీలకు పిచ్‌ను ఫలానావిధంగా తయారుచేయాలని చెప్పే హక్కు లేదు. అయినా నేను బాధ్యతలు స్వీకరించినప్పటినుంచి ఇదే కొనసాగుతోంది. భవిష్యత్తులోనూ మారే అవకాశం లేదు. ఆర్సీబీ స్పిన్నర్లు వికెట్లు తీయగలిగినప్పుడు కేకేఆర్ స్పిన్నర్లు ఎందుకు చేయలేకపోయారు? కృనాల్ మూడు వికెట్లు తీశాడు" అని వ్యాఖ్యానించాడు. దీంతో అతడిపై తీవ్రస్థాయిలో విమర్శలు రాగా, గతంలో తాను చేసిన వ్యాఖ్యలపై యూటర్న్ తీసుకున్నాడు. తానెప్పుడూ కేకేఆర్ నుంచి వచ్చిన విజ్ఞప్తులను తిరస్కరించలేదని తెలిపాడు.**

### అవన్నీ ఇస్తున్నారు.. 'సూపర్ బాల్'కూ అవార్డు ఇస్తే బాగుండు: అశ్విన్

"తొలి మ్యాచ్‌కు సంబంధించి ఏ అధికారి లేదా ప్లేయర్ నన్ను సంప్రదించలేదు. ప్రాక్టీస్ సమయంలో కోచ్ మాత్రమే నాతో మాట్లాడారు. పిచ్ ఎలా స్పందిస్తుందని అడిగారు. దానికి సమాధానంగా 'పిచ్ టర్న్ అవుతుంది. అదే సమయంలో బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటుంది' అని చెప్పా. నేనెప్పుడూ కేకేఆర్ నుంచి వచ్చే వాటిని తిరస్కరించలేదు. సుదీర్ఘకాలంగా నాకు మంచి అనుబంధం ఉంది. బీసీసీఐ గైడ్‌లైన్స్ ప్రకారమే పిచ్‌ను తయారుచేశా. నాపై ఆరోపణలు చేసే వారి సంగతి పట్టించుకోను" అని ముఖర్జీ వెల్లడించారు.

### అంతకుముందు రహానె ఏమన్నాడంటే?

బెంగళూరుతో మ్యాచ్ అనంతరం రహానె మాట్లాడుతూ.. "పిచ్ స్పిన్‌కు అనుకూలంగా ఉంటుందని ఆశించాం. కానీ, అలా జరగలేదు. మ్యాచ్‌కు ముందు ఒకటిన్నర రోజుల పాటు కవర్స్‌తో కప్పి ఉంది. మా జట్టులో నాణ్యమైన స్పిన్నర్లు ఉన్నారు. ఎలాంటి వికెట్‌పైనైనా అత్యుత్తమంగా బంతు లేయగలరు" అని రహానె తెలిపాడు.

### అక్కడినుంచి వెళ్లిపోండి: సైమన్ డౌల్

"సొంత మైదానాల్లో అనుకూలంగా పిచ్‌ను తయారుచేయించుకోలేకపోతే ఇంకెందుకు? వారు స్టేడియాలకు సంబంధించి ఫీజులను కడుతున్నారు. కానీ, హోం టీమ్ అడిగింది క్యూరేటర్ చేయకపోతే ఎలా? అలాంటప్పుడు ఫ్రాంచైజీని వేరే మైదానానికి మార్చేసుకుంటే సరిపోతుంది. అతడి బాధ్యత పిచ్‌ను తయారుచేయడమే. మ్యాచ్‌పై అభిప్రాయాలను వెల్లడించడానికి కాదు అతడికి పే చేస్తుంది" అని కివీస్ మాజీ క్రికెటర్, వ్యాఖ్యాత సైమన్ డౌల్ వ్యాఖ్యానించాడు.

# నా మెంటార్ ధోనీ మాటలనే ఆచరించా: పంత్

**భీకరమైన ఫామ్‌లో ఉన్న సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ అడ్డుకట్ట వేసింది. ఉప్పల్ మైదానం వేదికగా జరిగిన మ్యాచ్‌లో అన్ని విభాగాల్లో ఎస్ఆర్‌హెచ్‌పై లఖ్‌నవూ ఆధిపత్యం ప్రదర్శించింది. ఐపీఎల్ 2025 సీజన్‌లో తన మొదటి మ్యాచ్‌లో విజయానికి చేరువగా వచ్చి ఓడినప్పటికీ.. రెండో పోరులో మాత్రం లఖ్‌నవూ స్ఫూర్తిదాయకమైన ఆటను ప్రదర్శించింది. క్లిష్ట సమయాల్లో ఎలా ఉండాలో తన మెంటార్ ఎంఎస్ ధోనీ నుంచి నేర్చుకొన్నట్లు లఖ్‌నవూ కెప్టెన్ పంత్ వెల్లడించాడు.**

"గొప్ప ఊరట కలిగించే ఫలితం. మేమెప్పుడూ టీమ్ వర్క్ మీదనే దృష్టిపెడతాం. అలాగని విజయం సాధించినప్పుడు పొంగిపోం. ఓడినప్పుడు కుంగిపోం. మన చేతుల్లో లేనివాటి గురించి ఆలోచించం. నా మెంటార్ (ఎంఎస్ ధోనీ) నుంచి నేర్చుకున్నదదే. మన కంట్రోల్‌లో ఉన్న వాటిపైనే దృష్టిపెట్టాం. యువ బౌలర్ ప్రిన్స్ చక్కగా బౌలింగ్ చేశాడు. శార్దూల్ ఠాకూర్ అద్భుతం. పూరన్‌ను బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందు పంపించడంలో ప్రత్యేక కారణం ఏమీ లేదు. అతడికి ఇంకాస్త స్వేచ్ఛ ఇవ్వాలనే అలా చేశాం. దూకుడుగా ఆడేటప్పుడు మరింత ప్రోత్సాహం ఇవ్వాలి. ఇప్పటికీ మా అత్యుత్తమ క్రికెట్ ఆడలేదనుకుంటున్నా. అయితే, ఈ విజయం మాకు సంతోషం కలిగించింది" అని పంత్ () వెల్లడించాడు.

"ఆరెంజ్ క్యాప్ అందుకోవడం బాగుంది. అంతకుమించి విజయం సాధించడం ఎక్కువ ఆనందాన్నిచ్చింది. ప్రత్యేకంగా సిక్సుల కోసం ఎలాంటి ప్రణాళికలు రూపొందించుకోలేదు. బంతిని సరిగ్గా టైమ్ చేసి బాదా. మ్యాచ్‌లో సరైన సమయంలో నైపుణ్యాన్ని అమలుచేస్తే అలవోకగా పరుగులు వస్తాయి. హైదరాబాద్‌లో ఎప్పుడూ భారీ స్కోర్లే నమోదవుతాయి. పవర్ ప్లేలో వికెట్లు పడకుండా ఉంటే ఎంతటి లక్ష్యాన్నైనా ఛేదించే అవకాశం ఉంటుంది. మిచెల్ మార్ష్‌తో కలిసి లెఫ్ట్-రైట్ కాంబినేషన్‌తో పరుగులు రాబడుతున్నా. మంచి భాగస్వామ్యాలు నమోదు చేస్తే ఆటోమేటిక్‌గా మ్యాచ్‌పై పట్టు సాధించడం సులువు" అని ఆరెంజ్ క్యాప్ హోల్డర్ నికోలస్ పూరన్ తెలిపాడు. రెండు మ్యాచుల్లో 145 పరుగులు చేశాడు. పర్పుల్ క్యాప్‌ను శార్దూల్ ఠాకూర్ (6 వికెట్లు) సొంతం చేసుకున్నాడు.

# భువీ 'డాట్స్'.. ఐపీఎల్‌లో ఈ రికార్డు బద్దలవుతుందా?



**టీ20ల్లో బౌలర్లపై బ్యాటర్లదే ఆధిపత్యమని తెలుసు కదా.. గత ఐపీఎల్ సీజన్‌లో 250+ స్కోర్లు అలవోకగా వచ్చేశాయి. ప్రస్తుతం 18వ ఎడిషన్ నడుస్తోంది. ఇప్పటికే మూడు జట్లు 230+ స్కోర్లను నమోదు చేశాయి. బ్యాటింగ్ హవా కొనసాగుతోన్న ఐపీఎల్‌లో.. భువనేశ్వర్ కుమార్ మాత్రం అద్భుతమైన ఓ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ఇప్పటికీ అతడిదే ఈ ఘనత. మరి అదేంటి? దానిని ఎవరైనా అధిగమించే అవకాశం ఉందా?**

పొట్టి ఫార్మాట్‌లో డాట్ బాల్స్ (పరుగులేమీ ఇవ్వకుండా బంతి వేయడం) చాలా కష్టం. ప్రతి బంతిని బాదడంతోపాటు కనీసం సింగిల్ అయినా తీద్దామని బ్యాటర్లు భావిస్తారు. కానీ, వెటరన్ బౌలర్ భువనేశ్వర్ కుమార్ మాత్రం 176 మ్యాచుల్లో 1,670 డాట్స్ వేశాడు. అంటే 704 ఓవర్లలో 278 ఓవర్లు పరుగులు ఇవ్వలేదని అర్థం. ఐపీఎల్‌లో ఇప్పటి వరకు భువీ 181 వికెట్లు తీశాడు. మొత్తం 14 మెయిడిన్లు సంధించాడు. భువనేశ్వర్ (%దీప్త్రబజఅవంప్త్రఘుతీ ఖబమ్ఘుతీ%) రికార్డును అధిగమించాలంటే కేవలం ఇద్దరికి మాత్రమే అవకాశం ఉంది. భువనేశ్వర్ కుమార్ కూడా ఆర్సీబీ తరఫున ఐపీఎల్ 2025 సీజన్ బరిలోకి దిగడంతో అతడి రికార్డుకు ఇప్పట్లో ఢోకా ఉండదనేది క్రికెట్ విశ్లేషకుల అభిప్రాయం. భువీ తర్వాత కేకేఆర్ ఆటగాడు సునీల్ నరైన్ (1,610 బంతులు), రవిచంద్రన్ అశ్విన్ (1,572 బంతులు) మాత్రమే కాస్త చేరువగా ఉన్నారు.

# 'ఆర్సీబీ' నాటి సంబరాలకు 'సీఎస్కే' నేడు బదులు తీర్చుకొనేనా?



**ఐపీఎల్ 2025లో ఆసక్తికర సమరానికి రంగం సిద్ధమైంది. ఐపీఎల్‌లో అత్యంత ప్రేక్షకాదరణ పొందిన చెన్నై సూపర్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య చెపాక్ వేదికగా నేడు (మార్చి 28) మ్యాచ్ జరగనుంది. క్రికెట్ మైదానంలో దిగ్గజ ఆటగాళ్లు ఎంఎస్ ధోనీ, విరాట్ కోహ్లీ ప్రత్యర్థులుగా తలపడనున్న ఈ మ్యాచ్ కోసం ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ ఇరుజట్ల బలాలు, బలహీనతలు ఏంటి? రెండు జట్ల మధ్య జరిగిన చివరి మ్యాచ్‌లో ఏం జరిగిందో తెలుసుకుందాం.**

### ఆర్సీబీ.. ఆరంభ సీజన్‌లో తప్ప

ఈ సీజన్‌లో సీఎస్కే, ఆర్సీబీ ఇప్పటికే చెరో మ్యాచ్ ఆడి విజయం సాధించాయి. డిఫెండింగ్ ఛాంపియన్ కోల్‌కతాను ఓడించి బెంగళూరు జోష్‌లో ఉండగా.. బలమైన ముంబయి ఇండియన్స్‌ను మట్టికరిపించి చెన్నై ఆత్మవిశ్వాసంతో ఉంది. ఐపీఎల్‌లో బెంగళూరుపై సీఎస్కేకు తిరుగులేని రికార్డు ఉంది. రెండు జట్ల మధ్య ఇప్పటివరకు 33 మ్యాచ్‌లు జరగ్గా.. చెన్నై ఏకంగా 21 మ్యాచ్‌ల్లో జయకేతనం ఎగరవేసింది. ఆర్సీబీ కేవలం 11 మ్యాచ్‌ల్లోనే నెగ్గింది. ఒక మ్యాచ్‌లో ఫలితం తేలలేదు. మరో విశేషం ఏంటంటే చెపాక్‌లో ఆర్సీబీ గత 17 ఏళ్లలో ఒక్క మ్యాచ్‌లోనూ నెగ్గలేదు. ఐపీఎల్ ఆరంభ సీజన్‌లో తప్ప తర్వాత జరిగిన ఎనిమిది మ్యాచ్‌ల్లో ఆతిథ్య జట్టే విజయం సాధించింది.

### ధోనీనే బలం.. స్పిన్నే ప్రధాన ఆయుధం

చెపాక్ పిచ్ స్పిన్నర్లకు సహకరిస్తుంది. దీంతో ఈ మైదానంలో భారీ స్కోర్లు చేయడం అంత సులువు కాదు. ఈ సీజన్‌లో చెన్నై, ముంబయి మధ్య జరిగిన మ్యాచ్‌లోనూ స్పిన్నర్లు కీలకపాత్ర పోషించిన విషయం తెలిసిందే. నూర్ అహ్మద్, అశ్విన్, రవీంద్ర జడేజాలతో కూడిన స్పిన్ త్రయాన్ని ఎదుర్కోవడం ఆర్సీబీ బ్యాటర్లకు సవాలే. ఆర్సీబీ స్పిన్నర్లు కృనాల్ పాండ్య, సుయాశ్ శర్మ, లివింగ్‌స్టోన్ చెన్నై బ్యాటర్లను ఎలా కట్టడి చేస్తారో చూడాలి. ఈ మైదానంలో 170-180 స్కోరును కూడా కాపాడుకోవచ్చు. విరాట్ కోహ్లీ, ఫిల్ సాల్ట్ ఫామ్‌లో ఉండటం ఆర్సీబీకి కలిసొచ్చే అంశం. రచిన్ రవీంద్ర, రుతురాజ్ గైక్వాడ్, రాహుల్ త్రిపాఠి, శివమ్ దూబె వంటి స్టార్ ఆటగాళ్లతో చెన్నై బ్యాటింగ్ లైనప్ బలంగా కనిపిస్తోంది. గత సీజన్ మాదిరిగా ధోనీ నుంచి మరోసారి భారీ సిక్స్‌లను చూడాలనేది అభిమానుల ఆకాంక్ష. తొలి మ్యాచ్‌లో బ్యాటింగ్‌కు వచ్చినప్పటికీ 2 బంతులను మాత్రమే ఎదుర్కొన్నాడు. పరుగులేమీ చేయకపోయినా అజేయంగా నిలిచాడు. ఇప్పుడు ఆర్సీబీతో మ్యాచ్‌లో స్పిన్ బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొన్న జట్టుకు విజయావకాశాలు ఎక్కువగా ఉంటాయనడంలో సందేహం లేదు.

### గత మ్యాచ్‌లో ఏమైందంటే?

ఓవరాల్‌గా సీఎస్కేపై ఆర్సీబీకి గొప్ప రికార్డు లేనప్పటికీ ఇరుజట్ల మధ్య జరిగిన చివరి మ్యాచ్‌లో బెంగళూరే విజయం సాధించింది. 2024లో చిన్నస్వామి స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో బెంగళూరు సంచలన విజయంతో ప్లేఆఫ్స్‌కు చేరింది. చివరి ఓవర్‌లో 18 పరుగులు చేస్తే చెన్నై నాకౌట్‌కు వెళ్లేది. కానీ ఆర్సీబీ బౌలర్ యశ్ దయాళ్ ఏడు పరుగులే ఇచ్చి ఎంఎస్ ధోనీ (%మీూ ఇప్త్రశీఅఱ%) వికెట్‌ను తీశాడు. దీంతో ఆ సీజన్‌లో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన సీఎస్కే లీగ్ దశలోనే ఇంటిముఖం పట్టింది. మ్యాచ్ ముగిసిన అనంతరం సంబరాల్లో మునిగిపోయిన బెంగళూరు ఆటగాళ్లు.. చెన్నై ప్లేయర్లతో కరచాలనం చేసేందుకూ కాస్త సమయం తీసుకున్నారు. మ్యాచ్ అయిపోయిన తర్వాత ధోనీ మైదానంలోకి వచ్చి వారి కోసం వేచి చూశాడు. అయితే, ఎంతకూ రాకపోవడంతో అక్కడున్న వారికి షేక్‌హ్యాండ్ ఇచ్చి డగౌట్‌కు వెళ్లిపోయాడు. అప్పట్లో ఇది చర్చనీయాంశంగా మారింది.

తెలుగురాష్ట్రం దినపత్రిక



# రకుల్ హై వోల్టేజ్ గ్లామర్ డోస్.. బెడ్డుపై అలా..

రకుల్‌ప్రీత్ సింగ్ టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్ సినిమాల్లో తన నటనతో మెప్పించి, వరుస విజయాలతో ఒకప్పుడు నెంబర్ వన్ రేసులో కొనసాగింది. నాన్నకు ప్రేమతో, సరైనోడు, ధృవ లాంటి బ్లాక్‌బస్టర్లతో తెలుగులో స్టార్‌డమ్ అందుకున్న రకుల్, బాలీవుడ్‌లోనూ పలు క్రేజీ సినిమాలు చేసింది. కానీ ఈ మధ్య అమ్మడికి సౌత్ లో పెద్దగా అవకాశాలు రావడం లేదు. నటనతో పాటు మోడ్రన్ ట్రెండీ లుక్స్, ఫిట్‌నెస్, స్టయిలింగ్‌లో ఆమెకు ప్రత్యేక గుర్తింపు ఉంది. సోషల్ మీడియాలో కూడా తన గ్లామర్ లుక్స్‌తో అలరిస్తుంటుంది. ఇప్పుడు తాజాగా రకుల్‌ప్రీత్ మరోసారి తన స్టన్నింగ్ గ్లామర్‌తో అభిమానులను ఆశ్చర్యపరిచారు. వర్సేస్ కలెక్షన్‌లో ఉన్న పింక్ బాడీకాన్ డ్రెస్‌లో బెడ్‌పై ముద్దుగా, ట్రెండీగా పోజులిచ్చారు. ఈ డ్రెస్ లో ఆమె అందం మరింత హైలైట్ అయింది. డ్రెస్‌లో గ్లామర్ పర్ఫెక్ట్‌గా ఉండేలా డిజైన్ చేయడం, షోల్డర్ పై డబ్బుల బకుల్స్ లుక్ ఓ డిఫరెంట్ టచ్ ఇచ్చింది. దానికి మ్యాచ్ అయ్యేలా హెయిర్ స్టయిల్, మేకప్ సింపుల్ గానే ఉండి కూడా స్టైలిష్‌దనాన్ని ఎక్కువగా చూపించింది. ఈ ఫోటోల్లో రకుల్ బెడ్‌పై లూస్‌గా రిలాక్స్ అవుతూ సరదాగా నవ్వుతూ, ఎక్స్‌ప్రెషన్లతో ప్యూర్ ఫన్ వైబ్ ఇస్తోంది. నవ్వుతో కూడిన క్యాప్షన్ పెట్టిన ఆమె జీవితాన్ని ఎంజాయ్ చేయాలన్న ఆలోచనను పంచుకుంది. ఈ లుక్‌లో ఆమె ధరించిన జ్యూవెలరీ, రింగ్స్, ఫుట్‌వేర్ అన్నీ వర్సేస్ స్టైల్‌కు తగ్గట్టు ఉండడం ప్రత్యేక ఆకర్షణ. స్టైలింగ్‌ను అంషికా నిర్వహించగా, ఫోటోలు బ్యూటిఫుల్‌గా క్లిక్ చేశారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ ఫోటోలు వైరల్ అవుతున్నాయి. రకుల్ స్టైల్, స్టయిలిష్ పోజులు చూసిన నెటిజన్లు కామెంట్ సెక్షన్‌లో హార్ట్ ఎమోజీలతో, "క్యూటీ!", "గ్లామ్ గర్ల్!" అంటూ ఫ్లడ్ చేస్తున్నారు. సినిమాల్లోకి కాకుండా ఫ్యాషన్‌లో కూడా రకుల్ తనదైన ట్రెండ్‌ను కొనసాగిస్తోంది. ఆమె ఏదైనా లుక్‌ను కాన్ఫిడెన్స్‌తో మోస్తూ, అందులోనూ ఓ ప్రత్యేకమైన ఫీల్ ఇవ్వగలుగుతోంది. ప్రస్తుతం రకుల్ కొన్ని ప్రాజెక్టులు డిస్కషన్‌లో ఉంచగా, బాలీవుడ్‌లో ఓ యాక్షన్ డ్రామా షుటింగ్‌లో ఉన్నారు.

# తిరుమల శ్రీవారి సేవలో హీరో నితిన్

- వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో స్వామివారిని దర్శించుకున్న నటుడు
- నితిన్‌తో పాటు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి
- ఇవాళ థియేటర్లలోకి వచ్చిన నితిన్ కొత్త సినిమా 'రాబిన్‌హుడ్'
- ఈ నేపథ్యంలోనే శ్రీవారి సేవలో హీరో నితిన్



టాలీవుడ్ యంగ్ హీరో నితిన్ ఈరోజు తిరుమల స్వామివారిని దర్శించుకున్నారు. శుక్రవారం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డితో కలిసి ఆయన శ్రీవారి సేవలో పాల్గొన్నారు. టీటీడీ అధికారులు వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో నితిన్‌కు వేద పండితులు ఆశీర్వచనం చేసి శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ాగా, ఈరోజు నితిన్ నటించిన కొత్త సినిమా 'రాబిన్‌హుడ్' థియేటర్లలోకి వచ్చిన విషయం తెలిసిందే. వెంకీ కుడుముల దర్శకత్వంలో వచ్చిన ఈ మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. నితిన్ సరసన కథానాయికగా యంగ్ బ్యూటీ శ్రీలల నటించగా... ఆసీస్ మాజీ క్రికెటర్ డేవిడ్ వార్నర్ అతిథి పాత్రలో నటించడం విశేషం.


# లైఫ్ లో రూల్స్ నచ్చవని వెల్లడి :సమంత



లైఫ్ లో రూల్స్ నచ్చవని వెల్లడి :సమంత ప్రముఖ నటి సమంత ప్రస్తుతం ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరంలో సందడి చేస్తున్నారు. భారతీయ చలన చిత్రోత్సవంలో పాల్గొన్న ఆమె, అక్కడి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆమె చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సమంత తన జీవిత దృక్పథం గురించి స్పష్టమైన వ్యాఖ్యలు చేశారు. విజయాన్ని కేవలం గెలుపుతో పరిమితం చేయకూడదని, ప్రయత్నమే అసలైన విజయమని ఆమె అన్నారు. వ్యక్తిగతంగా నచ్చిన విధంగా జీవించడమే నిజమైన సక్సెస్ అని అభిప్రాయపడ్డారు. అవార్డులు, రివార్డులు మాత్రమే విజయాన్ని నిర్వచించవని స్పష్టం చేశారు. "నా జీవితంలో నాకు నచ్చినట్లు జీవించాలని అనుకుంటాను. నియమ నిబంధనలు నన్నులేవు. నాకు ఇష్టమైన రంగంలో రాణించాలనేదే నా ధ్యేయం. ఆడపిల్లగా జన్మించాం కాబట్టి ఇది చేయకూడదు, అది చేయకూడదు అనే ఆంక్షలు నాకు ఇష్టం లేదు. అన్ని రకాల పాత్రలు పోషించి ప్రేక్షకులను మెప్పించాలనే తపన ఉంది" అని సమంత తెలిపారు. సిడ్నీ పర్యటన సందర్భంగా ఆమె అక్కడి యువతతో ముచ్చటించారు. తన అనుభవాలను పంచుకుంటూ, సినీ రంగంలో వచ్చిన సవాళ్లను ఎలా ఎదుర్కొన్నానో వివరించారు. సమంత వ్యాఖ్యలు యువతకు ప్రేరణగా మారాయి.

## భారీ బడ్జెట్ తో 'క్రిష్ 4'కు


# హీరో హృతిక్ దర్శకత్వం



ముంబయి : హృతిక్ రోషన్ హీరోగా తెరకెక్కిన 'క్రిష్' సిరీస్ సినిమాలు మంచి ప్రేక్షకాదరణతో బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపించాయి. ఇప్పటికే విడుదలైన మూడు భాగాలు భారీ విజయాన్ని అందుకోగా నాలుగో భాగం కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇప్పుడు ఫ్యాన్స్‌ను సర్‌ప్రైజ్ చేస్తూ ఈ సినిమా గురించి అప్‌డేట్ పంచుకున్నారు హృతిక్ తండ్రి, దర్శకుడు రాకేశ్ రోషన్. 'క్రిష్ 4'కు హృతిక్ దర్శకత్వం వహించనున్నట్లు స్పష్టం చేశారు. " 25 ఏళ్ల క్రిత్రం నిన్ను యాక్టర్‌గా ఇండిస్ట్రీకి పరిచయం చేశాను. ఇప్పుడు మళ్లీ 25 ఏళ్ల తర్వాత ఆదిత్యచోప్రా, నేను కలిసి నిన్ను డైరెక్టర్‌గా పరిచయం చేస్తున్నాం. దర్శకుడిగానూ నువ్వు ఎన్నో విజయాలు అందుకోవాలని కోరుకుంటున్నా. ప్రతిష్టాత్మకమైన 'క్రిష్ 4'కు నువ్వు దర్శకత్వం వహించడం ఆనందంగా ఉంది" అని రాకేశ్ రోషన్ పోస్ట్ పెట్టారు. దీంతో బాలీవుడ్ ప్రముఖులు ఈ స్టార్ హీరోకు ఆల్ ది బెస్ట్ చెబుతున్నారు. దీనిపై అప్‌డేట్స్ కోరుతూ అభిమానులు కామెంట్స్ పెడుతున్నారు. గత కొన్ని రోజులుగా 'క్రిష్ 4' చిత్రం నిత్యం వార్తల్లో నిలుస్తోంది. ఈ సిరీస్ చిత్రాలకు దర్శకత్వం వహించిన రాకేశ్ రోషనే దీనికి కూడా దర్శకత్వం వహించే అవకాశం ఉందని వార్తలు వచ్చాయి. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తాను ఈ చిత్రానికి దర్శకత్వం వహించడం లేదని స్పష్టం చేశారు. దీంతో ఈ సినిమాకు డైరెక్టర్ ఎవరని బీటౌన్‌లో పెద్ద చర్చ జరిగింది. రాకేశ్ తాజా పోస్ట్‌తో దీనిపై క్లారిటీ వచ్చింది. ఈ ఫ్రాంచైజీకి ప్రేక్షకుల్లో ఉన్న ఆదరణ రీత్యా రూ.700 కోట్ల భారీ బడ్జెట్‌తో హాలీవుడ్ స్థాయిలో 'క్రిష్ 4' రూపొందించాలని టీమ్ భావిస్తున్నట్లు తెలుస్తుంది.

# తెలంగాణ హైకోర్టులో విష్ణు ప్రియకి లభించని ఊరట

## విచారణలో కీలక మలుపు



ప్రముఖ సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ విష్ణుప్రియకు బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ వివాదంలో కొత్త చిక్కులు ఎదురవుతున్నాయి. పంజాగుట్ట పోలీసులు 11 మంది సెలబ్రిటీలు, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లపై కేసులు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఇందులో విష్ణుప్రియ కూడా ఒకరు. తాజాగా, విచారణకు హాజరు కావాలని పోలీసులు ఆమెకు నోటీసులు పంపారు. ఈ నెల 20న విచారణకు హాజరైన ఆమె, 25న మరోసారి పోలీసుల ఎదుట హాజరుకావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో, తనపై నమోదైన రెండు ఎఫ్ఐఆర్‌లను కొట్టివేయాలంటూ హైకోర్టును ఆశ్రయించిన విష్ణుప్రియకు ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. ఈరోజు విచారణలో, ఎఫ్ఐఆర్‌లను రద్దు చేయలేమని హైకోర్టు స్పష్టం చేసింది. పోలీసుల విచారణలో సహకరించాలని, చట్ట ప్రకారం ముందుకు వెళ్లాలని ఆమెకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో, కేసు మరో కీలక మలుపు తిరిగింది. ఈ కేసులో విష్ణుప్రియ తదుపరి కార్యాచరణ ఏమిటనేది ఆసక్తిగా మారింది.

**పోలీసులు నమోదు చేసిన కేసులు**

పంజాగుట్ట పోలీసులు బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్‌కు సంబంధించి ఇప్పటికే కేసులు నమోదు చేశారు. ఇందులో భాగంగా విష్ణుప్రియకు పోలీసులు నోటీసులు పంపారు. ఈ నెల 20న ఆమె విచారణకు హాజరయ్యారు. అయితే, విచారణ ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలో ఈ నెల 25న మరోసారి హాజరయ్యేలా ఆమెకు ఆదేశాలు జారీ చేశారు.

**హైకోర్టులో పిటిషన్ దాఖలు**

తనపై నమోదైన రెండు ఎఫ్ఐఆర్ లను రద్దు చేయాలని కోరుతూ విష్ణుప్రియ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఈరోజు ఆమె పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టింది. అయితే, ఎఫ్ఐఆర్ లను కొట్టివేయలేమని స్పష్టం చేస్తూ, విచారణకు సహకరించాలని ఆదేశించింది. చట్ట ప్రకారం విచారణ జరిపేందుకు పోలీసులకు అనుమతి ఇచ్చింది. దీంతో విష్ణుప్రియకు ఎదురైన సమస్యలు ఇంకా కొనసాగనున్నట్లు స్పష్టమవుతోంది. విష్ణుప్రియ కేసు విచారణ సందర్భంగా హైకోర్టు కొన్ని ముఖ్యమైన వ్యాఖ్యలు చేసింది. ఈ కేసులో న్యాయపరమైన అన్ని ప్రక్రియలను అనుసరించాలని పేర్కొంది. పోలీసుల విచారణకు సహకరించడం తప్పనిసరి అని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో విష్ణుప్రియ తదుపరి చర్యలు ఎలా ఉండబోతాయన్నదానిపై ఆసక్తి నెలకొంది.

**బెట్టింగ్ యాప్స్ పై కఠిన చర్యలు**

సమాజంలో బెట్టింగ్ యాప్స్ ప్రభావం పెరుగుతుండటంతో ప్రభుత్వ యంత్రాంగం కఠిన చర్యలు తీసుకుంటోంది. సెలబ్రిటీల ప్రమోషన్ వల్ల వీటి వ్యాప్తి పెరిగే అవకాశం ఉన్నందున, ఇందులో ప్రమేయం ఉన్నవారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొన్నారు. గతంలోనూ పలువురు ప్రముఖులు ఇలాంటి కేసుల్ని ఎదుర్కొన్నారు. దీంతో సోషల్ మీడియా ప్రముఖులు, సెలబ్రిటీలు తమ ప్రచార కార్యక్రమాల్లో జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339